ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 122

ఆదివారం 3 నవంబర్ 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD


## పట్టు బిగించిన టీమిండియా

భారత్ తొలి ఇన్నింగ్స్ 263.. ఆదుకున్న గిల్, పంత్

కివీస్ రెండో ఇన్నింగ్స్ 171/9.. జడేజాకు నాలుగు, అశ్వినక్ కు మూడు



07



## బీఆర్ఎస్ స్కీములపై దుష్ప్రచారం

అద్భుతమైన స్కీములకు స్కాములుగా ముద్ర

తెల్లారితే బూట్ల చప్పళ్లతో తెల్లారుతున్న తెలంగాణ

ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అద్భుతమైన స్కీములను స్కాములని దుష్ప్రచారంరం చేసిన దుర్మార్గులు ఇకనైనా తీరు మార్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. గత పదేండ్లలో తెలంగాణలో వేల కోట్ల అభివృద్ధి జరిగిందని కేంద్రం ప్రకటించిన లెక్కలను చూసైనా బుద్ధి తెచ్చుకోవాలంటూ చురకలంటించారు. కళ్లముందు ఆవిష్కృతమైన ఈ అద్భుతాలను

మిగతా 2 లో

# బీజేపీ రాష్ట్రాల్లో చీకట్లు..

# మా రాష్ట్రంలో వెలుగులు

కాంగ్రెస్ హయాంలో చీకట్లను తరిమేసి వెలుగులు నింపామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్ ఇలా తదితర అంశాలను వివరిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చారు.



## 11 నెలల్లోనే సంక్షమం, అభివృద్ధి పరుగులు

48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చాం

దాదాపు 50వేల మంది యువతకు ఉద్యోగాలు

బిఆర్ఎస్ దుషపరిపాలనకు చరమగీతం పాడాం

పేదలకు ఆరోగ్యశ్రీని పది లక్షలకు పెంచాం

ప్రధాని మోడీ విమర్శలకు ఎక్స్ వేదికగా రేవంత్ ఘాటు సమాధానం

హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఆనందం వెల్లువిరుస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చామని.. 11 నెలల్లోనే దాదాపు 50వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రియమైన నరేంద్ర మోదీ జీ. నా రాష్ట్రం, నా ప్రభుత్వం గురించి మీరు చేసిన ప్రకటనలలో అనేక అపోహలు, అవాస్తవాలపై స్పష్టత ఇవ్వడానికి నేను సంతోషిస్తున్నాను. డిసెంబర్ 7న

మిగతా 2 లో



03

## కార్తీకంలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ ఎండి సజ్జనార్ వెల్లడి



03

## సాగర్‌లో పర్యాటక శోభ

శ్రీశైలం వరకు లాంచీ ప్రారంభం



03

## ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోవాలి

వివాదంలో ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలు

## ప్రజాపాలన అంటే ప్రతిపక్షం గొంతు నొక్కడమా?

ప్రశ్నిస్తే కేసులు పెట్టినా బెదిరిస్తారా

శ్రీనివాస్ గౌడ్ తదితరులపై కేసులు దారుణం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : ప్రజాపాలన అంటే ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా అని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కేసులు కొత్త కాదని, ఎన్ని

మిగతా 2 లో

## యూనివర్సిటీలను బలోపేతం చేయండి

స్వేచ్ఛగా పనిచేసే మంచి పేరు తీసుకురండి

కొత్తగా నియమితులైన విసిలకు సిఎం రేవంత్ సూచన



హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : రాష్ట్రంలోని విశ్వవిద్యా లయాలను సమూలంగా ప్రక్షాళన చేసి.. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలని కొత్త వైఎస్‌ఛాన్సలర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా

మిగతా 2 లో

## ప్రచారం కోసమే తెలంగాణ సీఎం మార్పు

## సంక్రాంతి ముందు సర్పంచ్ ఎన్నికల నిర్వహణ

ఇందిరమ్మ ఇళ్ల కోసం అడుగులు వేస్తున్నాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ

తెలంగాణలో సీఎం మార్పుపై బిజెఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అటు కాంగ్రెస్, ఇటు మంత్రులు భగ్గుమన్నారు. ఈ ప్రచారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా స్పందించారు. శనివారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ... కేవలం ప్రచారం కోసం ఇలాంటి వ్యాఖ్యాలు చేస్తున్నారని కొట్టి పారేశారు.



హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : సంక్రాంతి పండగ ముందు సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇకపోతే తెలంగాణ సీఎం మార్పు ఉండదని స్పష్టం చేశారు. తమ

మిగతా 2 లో



## దేశవ్యాప్తంగా కులగణన జరగాల్సిందే

కాంగ్రెస్ దీనికి కట్టుబడి ఉంది

కులగణనపై సలహాలు, సూచనలు తీసుకుంటం

సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీ పేటెంట్

కులగణన కారక్రమం కోసం 5న రాహుల్ రాక

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్

హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్నది తమ పార్టీ నిర్ణయమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. నవంబర్ 5న బోయినపల్లిలోని మహాత్మా గాంధీ ఐడియాలాజీ సెంటర్‌లో కులగణనపై సలహాలు, సూచనల

మిగతా 2 లో

## మెట్రో రెండు దశకు గ్రీన్ సిగ్నల్



పరిపాలనా అనుమతులు మంజూరు

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు మార్గం సుగమమైంది. రెండో దశ నిర్మాణానికి రాష్ట్రం ప్రభుత్వం పరిపాలనా అనుమతులను జారీ చేసింది. ఈ రెండో దశలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది.

హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : ఇందులో నాగోల్ నుంచి శంషాబాద్, ఎల్‌బి నగర్ నుంచి హయత్ నగర్, రాయదుర్గం నుంచి నియో పోలీస్, మియాపూర్ నుంచి పటాన్‌చెరు కారిడార్లు ఉన్నాయి. మెట్రో రెండో దశకు అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు.గా ఉంటుందని

మిగతా 2 లో

## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

కీలక బిల్లులకు ఆమోదించే అవకాశం



రోమింగ్ న్యూస్ న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకూ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలిసింది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై ఈ శీతాకాల సమావేశాల్లో కీలకంగా చర్చించనున్నారు. వక్ఫ్ సవరణ బిల్లు 2024కు కూడా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 3 నవంబర్ 2024



# బీజేపీ రాష్ట్రాల్లో చీకట్లు.. మా రాష్ట్రంలో వెలుగులు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఆనందం ఆశలు వెల్లువెత్తాయి. దశాబ్దం బీఆర్ఎస్ దుష్పరిపాలన పోయి ప్రజల్లో సంతోషం వెల్లివిరిసిందన్నారు. బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే, తెలంగాణ ప్రభుత్వం మొదటి, రెండవ వాగ్దానాన్ని నెరవేర్చింది. అన్ని టీజీఎస్ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రి కవరేజీని విడుదల చేసింది. గత 11 నెలల్లో తెలంగాణాలోని సోదరీమణులు, తల్లులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారు. రాష్ట్రవ్యాప్తంగా 101 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. ఒక సంవత్సరంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం 3,433.36 కోట్లు ఖర్చు చేశాం. మా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే, మేము రైతులకి భరోసా ఇస్తూ రైతు రుణమాఫీని అమలు చేశాం. 22 లక్షల 22 వేల మంది రైతులు ఇప్పుడు ఎలాంటి రుణం లేకుండా, రాజులా జీవిస్తున్నారు. రూ. 2,00,000 వరకు రైతుల రుణాలన్నీ మాఫీ చేయబడ్డాయి. 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం‘ అని సీఎం చెప్పుకొచ్చారు. ఇళ్లకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఛార్జీ లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీంతో మహిళలు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉంటే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కేవలం రూ.500 కే సిలిండర్ లభిస్తుండడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా హయాంలో ఇప్పటివరకు 1.31 కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్ రీఫిల్‌లు జరిగాయి. 42,90,246 మంది లబ్దిపొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యువత కోసం ఉద్యోగ నియామకాలను చేపట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. అన్ని స్థాయిల పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను 11 నెలల కంటే తక్కువ సమయంలో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం 50,000 మంది అర్హులైన యువతకు ఉద్యోగాలు కల్పించింది. ఇది ఏ బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం చేయని రికార్డు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంగా పాఠశాల విద్యార్థులను విస్మరించింది. దశాబ్దం తర్వాత సంక్షేమ హాస్టళ్లలో పేద పిల్లలకు మెస్, కాస్మోటిక్ చార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. గతంలో నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని శుభ్రం చేసి పునర్వైభవం తీసుకొస్తున్నాం. గత 10 ఏళ్లలో ఆక్రమణలకు గురై, ధ్వంసం చేసిన మా సరస్సులు, నాలాలు విలువైన నీటి వనరులను కూడా మేము పరిరక్షిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క అంగుళం సరస్సు కూడా ఆక్రమణకు గురికాలేదు. అలాగే మేము ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. మేము యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, జిఎ స్పోర్ట్స్ యూనివర్శిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం బాల్ రోలింగ్‌ను సెట్ చేశాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు.గత 11 నెలల్లో మేము తెలంగాణలో చీకట్లను పారద్రోలి వెలుగులను నింపాం‘ అని రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.

# బీఆర్ఎస్ స్కీములపై దుష్ప్రచారం

మొదటి పేజీ తరువాయి



చూసి ఇప్పటికైనా మారాలని సూచించారు. పంటల దిగుబడిలోనే కాదు, పశు సంపద లోనూ గత పదేండ్లు పండగేనని చెప్పారు. కులవృత్తులకూ కేసీఆర్ కొండంత అండగా నిలవడం వల్లే పశుసంపదలోనూ గణనీయ వృద్ధి సాధించని తెలిపారు. గ్రామీణ తెలంగాణలో ఉపాధి పెంచాలనే తపన, సంపద సృష్టిలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే తాపత్రయం తమదని వెల్లడించారు. తెలంగాణలో ఉన్న డిమాండ్ తగ్గట్టుగా ఇక్కడే మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం చేశామన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రతినిత్యం వచ్చే వందలాది లారీల దిగుబడికి గత పదేండ్లలో కళ్లెంవేశాని చెప్పారు. ప్రతి ఆలోచన వెనక ఒక సుదీర్ఘ అధ్యయనం ఉందని, కేసిఆర్ లక్ష్యం ఆరోగ్య తెలంగాణ నిర్మాణమని స్పష్టం చేశారు. నేడు గొర్లు, చేప పిల్లల పంపిణీని నిలిపేసి కుల వృత్తులను రూపుమాపే కుట్రలు చేస్తున్న పాలకులారా కేంద్ర లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోవాలంటూ ఎక్స్ వేదికగా సూచించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామిక తెలంగాణలో మరోసారి ఎనుకటికాలంలా బూటుకాళ్ల శబ్దాలతో తెల్లవారే రోజులొచ్చాయని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతారని, పోరాడితే సస్పెన్షన్లు చేస్తారని మండిపడ్డారు. ఇది నియంతృత్వ రాజ్యమని, ప్రభుత్వం నిర్బంధాన్ని నిర్మిస్తున్నదని చెప్పారు. పోరాటం తెలంగాణకు కొత్తకాదని, ఈ మట్టి పొత్తిళ్లలోనే పోరాటం ఉన్నదని తెలిపారు. ఆ సహజత్వాన్ని ఎత్తిపడుతూ నిర్బంధాన్ని ఎదురిస్తామని, ప్రజాస్వామిక తెలంగాణ పునరుద్ధరణకై పోరాడుతామని చెప్పారు. హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలులో ఉండగా, 13 జిల్లాల్లో అధికారికంగా, 20కిపైగా జిల్లాల్లో అనధికారికంగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యూనివర్సిటీలను బలోపేతం చేయండి

మొదటి పేజీ తరువాయి



యూనివర్సిటీలను బలోపేతం చేసి, విద్యార్థుల్లో భరోసా కల్పించాల్సి ఉందన్నారు. యూనివర్సిటీలపై నమ్మకం పెంచాల్సిన తోణ బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఇటీవల ఆయా యూనివర్సిటీలకు కొత్తగా నియమితులైన ఉపకులపతులంతా కలసి హైదరాబాద్ లో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతకాలంగా యూనివర్సిటీల పై నమ్మకం తగ్గుతోందని, మళ్లీ విశ్వాసం పెంచేలా పనిచేయాలన్నారు. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని ఉపకులపతులకు సీఎం సూచించారు. యూనివర్సిటీల్లో ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం కోసం అవసరమైతే కన్సల్టెన్సీలను నియమించుకొని నివేదిక తయారు చేసుకోవాలని అన్నారు. ఒత్తిళ్ల ప్రభావంతో వీసీలను నియమించలేదని.. ప్రతిభ, సామాజిక సమీకరణలనే పరిగణనలోకి తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వీసీలు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని.. తప్పులు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకి స్వేచ్ఛ.. ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సీఎం వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టాలని.. విద్యార్థులను గమనిస్తూ అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# ప్రజాపాలన అంటే ప్రతిపక్షం గొంతు నొక్కడమా?

మొదటి పేజీ తరువాయి



బెదిరింపులకు పాల్పడినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరుపున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. తమ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. పేదల ఇండ్లు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించినందుకు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై తన కుటుంబ సభ్యులతోపాటు పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టినంత మాత్రానా భయపడేది లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో 60, 70 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టేందుకు జాబితాలు సిద్ధం చేసినట్టు తెలిసిందని ఏ ఒక్కరూ భయపడవద్దని మీకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు. వరద భాస్కర్ ఇంటికి పోతే అతనిని పోలీస్ వాళ్లు కొట్టారని బాధపడితే అడుగుదామని పోతే సీఐ లేరంటే కింద కూర్చున్నాం.. దానికి కూడా కేసు నమోదు చేసారా అంటూ ప్రశ్నించారు. కూలగొట్టిన దివ్యాంగుల ఇండ్లను కట్టివ్వమని కోరినం అదికూడా తప్పా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అప్పన్నపల్లి బ్రిడ్జి నిర్మాణం రెండేండ్లలో పూర్తి చేశాం, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని పెద్ద దవాఖాన నిర్మాణం చేశాం. వీటిపై అసత్య ప్రచారాలతో ఎన్నికల్లో ఓడించారు. ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. పేదల పక్షాన అడుగుతున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాల్లో అనేక కేసులు నమోదు చేసినా జంకలేదు. ఇప్పుడు మీరు పెట్టే కేసులకు బెదిరిపోతామా.. మీ బండారాన్ని బయటపెట్టేందుకు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అధికారులు, పోలీసులు కూడా గుర్తెరిగి ప్రవర్తించాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి

ఆమోద ముద్ర పడే అవకాశం ఉంది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదన, వక్ఫ్ సవరణ బిల్లు.. ప్రధానంగా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ రెండు అంశాల చుట్టూనే వాడీవేడిగా సాగనున్నాయి. 'వన్ నేషన్ -వన్ ఎలక్షన్' ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం 18 రాజ్యాంగ సవరణలను ఈ హైలెవల్ కమిటీ సిఫార్సు చేసింది. కాగా, వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుంటామని 15 విపక్ష పార్టీలు ఇప్పటికే హెచ్చరించాయి.దేశంలోని ఓటర్లు అందరూ లోక్ సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒకేసారి ఓటు హక్కును వినియోగించు కోవడం. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఒకే సమయంలో కాకపోయినా... ఒకే ఏడాదిలో ప్రజలు ఓటేస్తారు.

## ప్రచారం కోసమే తెలంగాణ సీఎం మార్పు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వానికి పీరియడ్ ఇంకా నాలుగేండ్ల ఒక నెల ఉందని.. పూర్తి కాలం రేవంత్ రెడ్డినే సీఎంగా ఉంటారని తెలిపారు. ప్రతిపక్షాలు ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏమైనా చిన్న చిన్నవి ఉంటే అవి టీ కప్పులో తుఫాను మాత్రమే అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. మంత్రి ఇంకా మాట్లాడుతూ.. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తామన్నారు. గ్రామ సభలు పెట్టి ఇండ్లను మంజూరు చేస్తామని.. నాలుగు విడతల్లో 5 లక్షలు పేమెంట్ చేస్తామన్నారు. ఫౌండేషన్ లెవల్‌కు లక్ష, లెంటల్ లెవల్‌కు 1.25 లక్షలు, స్లాబ్ లెవల్‌కు 1.75 లక్షలు, పూర్తి అయ్యాక లక్ష చెల్లిస్తామన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం ఉంటుందన్నారు. సొంత స్థలంలో ఇండ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసి నిర్మాణం మొదలు పెట్టిన ఇండ్లకు కూడా సహాయం చేస్తామన్నారు. ఈ నెల 20లోపు ఇందిరమ్మ కమిటీలు లబ్దిదారుల జాబితాను పంపిస్తాయన్నారు. నెలాఖరుకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి అవుతుందని వెల్లడించారు. ఆ వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఫ్రీ ఇసుక ఇచ్చే అవకాశాలు పరిశీలిస్తామన్నారు. కేంద్ర గృహ నిర్మాణ స్కీం అడాప్ట్ చేసుకుంటున్నామని.. పేద ప్రజలకు అన్యాయం జరగొద్దని కేంద్రం ఎన్ని కండిషన్‌లు పెట్టినా ఒప్పుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేంద్రం లోగో పెట్టుకోవడానికి కూడా ఒప్పుకున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలకు కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఞాబోయే నాలుగేళ్లు 20 లక్షల ఇండ్ల నిర్మాణం టా÷-గ్గ÷ట్ పెట్టుకున్నామని.. తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి విడత ఇండ్లకు 26 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. తెలంగాణ సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డిని వచ్చే ఏడాది మారుస్తారని, ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేదా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సీఎం చేస్తారంటూ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యల్లో వాస్తవం లేదని కాంగ్రెస్ నేతలు ఖండిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా కులగణన జరగాల్సిందే

మొదటి పేజీ తరువాయి



కోసం నిర్వహించే కార్యక్రమంలో కాంగ్రెస్?అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్?ఖర్గే పాల్గొంటారని పేర్కొన్నారు. కులగణన పక్రియకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటారని చెప్పారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్ రెడ్డి ఉండగా మళ్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రస్తావన ఎందుకు వస్తుందన్నారు. తెలంగాణ ప్రజల నమ్మకానికి అనుగుణంగా మేం ప్రజా పాలన అందిస్తున్నం. బీజేపీలో మహేశ్వర్ రెడ్డికి గౌరవం లేదు. ఆయనకు అక్కడ కనీసం సీటు కూడా లేదు. కిషన్ రెడ్డికి, మహేశ్వర్ రెడ్డికి పచ్చి గడ్డి వేస్తే భగ్గుమంటుందని అంటారు. పక్క పార్టీల గురించి మేం మాట్లాడం. కాంగ్రెస్ లో ఉన్న ప్రజాస్వామ్యం.. స్వేచ్ఛ వేరే పార్టీలో ఉండదు. ప్రధాని మోదీ ఇస్తానన్న సంక్షేమ పథకాలు.. ఉద్యోగాలు ఏవి..? సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీ పేటెంట్. పీసీసీ తరుపున అన్ని పార్టీలను పిలిచి ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించి సలహాలు తీసుకుంటాం. కుల గణన సర్వే ఎక్కడ బ్రేక్ లేకుండా జరగాలి అనేదే ప్రభుత్వం ఆలోచన. కేసీఆర్ కి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు.

## మెట్రో రెండు దశకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి



భావిస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 7, 313 కోట్లు. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో మూడు కారిడార్లలో కలుపుకుని మొత్తం 69 కిలోమీటర్ల మేర నిర్మాణం జరిగింది. మొదటి దశ ప్రాజెక్టుకు రూ. 22 వేల కోట్లు ఖర్చైంది. హైదరాబాద్ మెట్రో ద్వారా ప్రస్తుతం రోజుకు దాదాపు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రెండో దశ కూడా అందుబాటులోకి వస్తే రోజుకు మరో 8 లక్షల మంది మెట్రోలో ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండో దశ నిర్మాణ పనులు అయిదు కారిడార్లలో మొత్తం 76.4 కిలో మీటర్ల మేర జరగనున్నాయి. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు పీపీపీ విధానంలో మెట్రో రెండో దశ పనులు జరగబోతున్నాయి. ఈ భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 30 శాతం అంటే రూ. 7, 313 కోట్లు. కేంద్ర ప్రభుత్వం వాటు 18 శాతం అంటే 4,230 కోట్లు. మిగిలిన 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుతారు. అలాగే కొత్తగా నిర్మించబోయే ఫ్యూచర్ సిటీకి కూడా ఇందులో ప్రణాళిక చోటుచేసుకుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 3 నవంబర్ 2024





# కార్తీకంలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

**పౌర్ణమి సందర్భంగా**

**అరుణాచాలనికి స్పెషల్ సర్వీస్**

**ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి**

హైదరాబాద్,నవంబర్ 2 : కార్తిక మాసంలో ప్రసిద్ధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. శ్రీశైలం, వేములవాడ, ధర్మపురి, కీసరగుట్ట తదితర దేవాలయాలకు హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సులను నడుపుతున్నామని పేర్కొన్నారు. ఆది, సోమవారాలు శైవక్షేత్రాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆర్టీసీ పనితీరు, కార్తికమాసం ఛాలెంజ్, శబరిమల ఆపరేషన్స్, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై హైదరాబాద్ బస్‌భవన్ నుంచి ఉన్నతాధికారులతో ఆయన దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీకి కార్తిక మాసం, శబరిమల ఆపరేషన్స్ ఎంతో కీలకమని, భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. ఈ నెల 15న కార్తిక పౌర్ణమి



నేపథ్యంలో తమిళనాడులోని అరుణాచలం వెళ్లే భక్తులకు ప్రత్యేక ప్యాకేజీ అందిస్తున్నామని సజ్జనార్ తెలిపారు. ఏపీలోని పంచారామ క్షేత్రాలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను బిణబసబిఇశిబీబ.తిని వెబ్‌సైట్‌లో చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలన్నారు. బస్ ఆన్ కాంట్రాక్ట్ ఛార్జీలు తగ్గించినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు.

# కేరళ ఎక్స్‌ప్రెస్ ఢీకొని..

**రైల్వే ట్రాక్‌పై పనిచేస్తున్న నలుగురు దుర్మరణం**

తిరువనంతపురం, నవంబర్ 2 : కేరళ ఎక్స్‌ప్రెస్ ఢీకొని నలుగురు పారిశుధ్య కార్మికులు మృతి చెందారు. శనివారం(నవంబర్ 2) మధ్యాహ్నం 3:30 సమయంలో షోరనూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులు షోరనూర్ వంతెన సమీపంలోని రైల్వే ట్రాక్‌పై చెత్తను తొలగిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సిబ్బంది ట్రాక్‌కి ఇరువైపులా చెత్తను తొలగిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. శుభ్రపరుస్తున్న ట్రాక్‌పైనే రైలు వెళ్తుందని వారు ఊహించలేదని, ట్రైన్ వేగంగా దూసుకురావడంతో తప్పించుకోలేకపోయారని వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వీరిని తమిళనాడులోని సేలంకు చెందినవారిగా గుర్తించారు. ఈ ఘటనలో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా, నాలుగో వ్యక్తి మృతదేహం నదిలో పడిపోయింది. దాన్ని వెలికితీసేందుకు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు

# కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం

**ఐదు, పదేళ్లకోమారు గణన అవసరం**

**ఎంపి గడ్డం వంశీకృష్ణ స్పష్టీకరణ**

మంచిర్యాల, నవంబర్ 2 : కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ప్రతి ఐదు, పదేండ్లకోసారి జనాభా, కుల గణన చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ప్రభుత్వ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వివిధ కుల సంఘాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. ’రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టడం సంతోషకరం. ఆయా సామాజిక వర్గాల జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలు చేయడానికి అవకాశం ఉంటుంది. తద్వారా బడుగు, బలహీన వర్గాలకు సమాన న్యాయం చేకూరుతుంది. రాష్ట్రంలో గత పదేండ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇయ్యలే. కులగణన కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తే తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా మారుతుంది’ అని తెలిపారు. కులగణన అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంచిర్యాల వెళ్తున్న ఎంపీ వంశీకృష్ణ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్?బీ గెస్ట్ హౌజ్ లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్?తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఎంపీని శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎంపీ కులగణనపై మీడియాతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలని కులగణన చేపట్టడం జరిగిందన్నారు. దేశంలోనే కుల గణన చేపట్టిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఖ్యాతి గడించనుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మక్కా న్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల వారు అత్యున్నత స్థాయికి వెళ్లడానికి కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

హైదరాబాద్,నవంబర్ 2 : నగరంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. తార్నాకలో ఆర్టీసీ బస్సు మహిళను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఈ ప్రమాదానికి కారణమైన కుషాయిగూడ డిపో ఆర్టీసీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

# తిరుమలకు పోటెత్తిన భక్తులు

**దర్శనానికి 24 గంటల సమయం**

తిరుమల, నవంబర్ 2 : తిరుమలకు మరోమారు భక్తులు పోటెత్తారు. దీపావళి పండుగ, వారాంతపు సెలవులు కలిసి రావడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి తిరుమలకు భక్తులు తాకిడి పెరగడంతో ఎలాంటి టోకెన్లు లేని సామాన్య భక్తులకు.. శ్రీవారిని దర్శించుకునేందుకు సుమారు 24 గంటల సమయం పడుతోందని సమాచారం. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లతో పాటు నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు అన్నీ పూర్తిగా నిండి.. వెలుపలకు వచ్చిన క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు.

# హైకోర్టు ఉత్తర్వుల మేరకే కులగణన

**కులగణనతో బీసీల్లో పెనుమార్పులు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



కరీంనగర్,నవంబర్ 2 : కులగణనతో బీసీల్లో పెనుమార్పులు రాబోతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ, హైకోర్టు ఉత్తర్వుల మేరకే కులగణన చేస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థలు, ఇతర రంగాల రిజర్వేషన్లపై ఆలోచన చేస్తున్నామని, డిసెంబర్?లో సర్వే నివేదికను ప్రభుత్వం ముందు ఉంచుతామని తెలిపారు. కులగణనపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. బీసీ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుబట్టలేదని.. డెడికేషన్ కమిటీ వేయాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సకల జనుల సర్వేను చేపట్టి కనీసం రిపోర్టును కూడా బయటపెట్టలేదని ఎద్దేవా చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో కులగణన జరుగుతోందని స్పష్టం చేశారు. సర్వే విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు, అయోమయం అక్కర్లేదని అన్నారు. అందరూ సర్వేకు సహకరించాలని పొన్నం పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏవీ

**సన్నవడ్లకే బోనస్ ఇస్తామనడం సరికాదు**

**బీజేపీ నేత యెండల లక్ష్మీ నారాయణ**


హైదరాబాద్,నవంబర్ 2 : రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు అధికారంలోకి వచ్చినాక కేవలం సన్నవడ్లకే బోనస్ ఇస్తామంటోందని బీజేపీ నేత యెండల లక్ష్మీ నారాయణ అన్నారు. నాంపల్లిలోని బీజేపీ ఆఫీస్ లో మాట్లాడుతూ.. ’ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మిల్లర్స్ బ్యాంక్ గ్యారెంటీలతో కొనుగోలు చేపిస్తామన్నారు. ఆ పక్రియ జరగాలి అంటే నెల రోజులు పడుతుంది. అప్పటి లోపు రైతులు ఎంతోకొంతకు అమ్ముకుంటారు. కాంగ్రెస్ నేతలు ఎప్పుడు ఏదో అంశంతో సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పుడు మూసిలో భారీ గాంధీ విగ్రహం పెడుతాం అంటున్నారు. పెడితే పెట్టారు కానీ .. రైతులు మాత్రం మావడ్లు కొనుగోలు చేయండి అంటున్నారు’ అని లక్ష్మీ నారాయణ అన్నారు. ఇక పార్టీ రాజ్యాంగం ప్రకారం ఎన్నికల నిర్వహణ పక్రియ ఉంటదని యెండల లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ నెల 7వ తేదీన సంస్థాగత ఎన్నికల నిర్వహణపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని వివరించారు. సంస్థాగత ఎన్నికలు కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ బీజేపీ అని చెప్పారు. పోలింగ్ బూత్ నుండి మొదలు పెట్టి మండల, జిల్లా, రాష్ట్ర ఆతరువాత జాతీయ స్థాయి వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, బీజేపీ జాతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా లక్ష్మణ్ ఉన్నారని వెల్లడించారు. సంస్థాగతంగా 33 జిల్లాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులను నియమించామని వివరించారు. ఈనెల 8 , 10 వ తేదీల్లో జిల్లా వర్కుషాప్ లు, 11 నుండి 14 వరకు మండల ఎన్నికల వర్కుషాప్ లు ఉంటాయన్నారు..

# కులగణన హామీని అమలు చేస్తున్నాం: ఆదిశ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల,నవంబర్ 2 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగనన చేపడుతామని హామీ మేరకు ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మూడు నెలల్లో హై కోర్టు కులగణన నివేదిక సమర్పిస్తామని, అన్ని వర్గాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై మీ సలహాలు సూచనలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సమగ్ర కులగణన ఇంటింటి సర్వే అవగాహన సదస్సుకు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ పిలుపు మేరకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, రాహుల్ గాంధీ పిలుపు మేరకు కులగణన గత ఎన్నికల్లో పిలుపునిచ్చారన్నారు.

# ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోవాలి

**వివాదంలో ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలు**



శ్రీరీనగర్,నవంబర్ 2 : నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా వివాదంలో చిక్కుకున్నారు. ఉగ్రవాదుల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ఉగ్రవాదులను అంతమొందించడానికి బదులుగా ప్రాణాలతో పట్టుకోవాలని ఆయన సూచించడం పెను దుమారం రేపింది. ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకుంటే బుద్గామ్?లో జరిగిన కాల్పుల వెనుక ఉన్న మాస్టర్ మైండ్‌ను కనిపెట్టొచ్చని ఆయన సూచించారు. జమ్మూ కశ్మీర్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగా ఈ ఉగ్ర కాల్పులు జరిగాయేమోనని అనుమానంగా ఉందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వలస కార్మికులపై జరిగిన ఈ కాల్పుల ఘటనపై విచారణ జరపాలని, టెర్రరిస్టులను ప్రాణాలతో పట్టుకుంటే ఈ ఉగ్రదాడుల వెనుక ఎవరున్నారో విచారణ జరిపి తెలుసుకోవచ్చని ఆయన చెప్పుకొచ్చారు. ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఏదైనా ఏజెన్సీ ఈ కుయుక్తులకు పాల్పడుతుందేమోననే కోణంలో తామూ విచారణ చేస్తామని ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. జమ్ము కశ్మీర్ లోని బుద్గామ్ జిల్లాలో యూపీకి చెందిన ఇద్దరు వలస కార్మికులు ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన సంగతి తెలిసిందే. కశ్మీర్ వ్యాలీలో అమాయకులైన వలస కార్మికులపై గత రెండు వారాల్లో నాలుగు సార్లు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. జమ్మూకాశ్మీర్‌లోని గందర్ బాల్ జిల్లా గగాంగిర్ వద్ద టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు చనిపోయిన ఘటన ఉగ్రమూకల దుశ్చర్యకు అద్దం పట్టింది. మృతుల్లో ఒక డాక్టర్, ఐదుగురు వలస కార్మికులు ఉన్నారు. గుండ్ ప్రాంతంలో సొరంగాన్ని నిర్మించే పనిలో కార్మికులు ఉండగా టెర్రరిస్టులు కాల్పులు జరిపారు. ఈ అటాక్‌లో ఇద్దరు స్పాట్?లోనే చనిపోగా, మరో ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

# సాగర్‌లో పర్యాటక శోభ

**శ్రీశైలం వరకు లాంచీ ప్రారంభం**



నాగార్జునసాగర్, నవంబర్ 2 : తెలంగాణ ప్రకృతి పర్యాటకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు అద్భుత బోటు ప్రయాణాన్ని కార్తీక మాసం తొలిరోజు శనివారం పర్యాటకశాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్లాన్ చేస్తున్నప్పటికీ నాగార్జునసాగర్ డ్యాం లో సరైన మట్టంలో నీటి లభ్యత లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుత వర్షాకాల సీజన్లో విస్తృతస్థాయిలో వర్షాలు పడడం వల్ల కృష్ణానది తీరం వెంట, అటు శ్రీశైలం నుండి ఇటు నాగార్జునసాగర్ డ్యాం వరకు గరిష్ట మట్టంలో నీటి లభ్యత ఉండటం వల్ల రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు ఈ బోట్ ప్రయాణాన్ని ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ లాంచ్ ప్రయాణానికి మొట్టమొదటి రోజున తెలంగాణ రాష్ట్రం తో పాటు పరిసర రాష్ట్రాల నుండి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చారు. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది. శ్రీశైలంలో రూమ్, ట్రాన్స్ పోర్ట్ వంటికి ఎవరికి వారే భరించాల్సి ఉంటుంది.

# సీతారామ పూర్తికి పనిచేయండి

**ఇంజనీరింగ్ అధికారులకు మంత్రుల ఆదేశం**

హైదరాబాద్,నవంబర్ 2 : సీతారామ ఎత్తిపోతల పథకం పనులను త్రగా పూర్త ఇచేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రులు తెలిపారు. పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఆరు నెలలు చాలా కీలకమని, సత్తుపల్లి ట్రంక్ కెనాల్, యాతలకుంట వరకు పనులు పూర్తి చేస్తే.. వచ్చే పంటకాలానికి సాగు నీరందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిజైన్లు, టెండర్ల పక్రియ వెంటనే చేపట్టాల్సిందిగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కానీ, పరిపాలనా అనుమతులు ఇచ్చే బాధ్యత తాను తీసుకొంటానని, అధికారులు త్వరితగతిన పనులు ఆరంభించాలని ఉత్తమ్ ఆదేశించారు. ప్రతీ 15 రోజులకు పనులపై సమీక్షించి, ఎప్పటికప్పుడు తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 3 నవంబర్ 2024





# జమ్ము కశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదులు ఏరివేత

## ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆర్మీ

న్యూఢిల్లీ, నవంబర్ 2 : జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోంది. తాజాగా అనంత్‌నాగ్ జిల్లాలో శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో హల్కన్ గలి ప్రాంతంలో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులకు భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. కాగా, కశ్మీర్ లోయలో శుక్రవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడిన చేసిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల ఘటనలో ఇద్దరు కార్మికులు చనిపోగా.. ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని శ్రీనగర్‌లోని జేవీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన భద్రతా బలగాలు కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల కోసం తీవ్రంగా గాలింపు



చేపడుతున్నారు. మరోవైపు శనివారం ఉదయం నుంచి శ్రీనగర్‌లోని ఖాన్యార్ ప్రాంతంలో తుపాకుల మోత మోగుతోంది. ఇక్కడ ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం యూపీకి చెందిన ఇద్దరు వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఆ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భారత దళాలు.. వారిపై ఎదురు కాల్పులకు దిగారు. ప్రస్తుతం అక్కడ ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకూ ఇరువైపులా ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు లేవని వెల్లడించారు.

## ఆనాడు బిఆర్ఎస్ కూడా మూసీ ప్రణాళిక చేసింది

### ఇప్పుడేమో కాదని వదిస్తోంది: అసదుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్,నవంబర్ 2 : మూసీ ప్రక్షాళన కోసం ఆనాడు బిఆర్ఎస్ ప్రణాళికలు చేసి ఇవాళ్ల మాటమార్చి మాట్లాడడం దారుణమని, భారాస నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మూసీ ప్రక్షాళన కోసం భారాస ప్రణాళికలు చేయలేదా? ఆ ప్రణాళిక వద్దని నేను చెప్పలేదా? అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా? నేను నోరు విప్పితే భారాస వాళ్లు ఇబ్బంది పడతారని అన్నారు. ఇళ్లు కదల్చకుండా మూసీ ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తాం. భారాస విధానాలు స్థిరంగా ఉండాలి. ఆ పార్టీకి జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు మా చలవే. ఎంఐఎం మద్దతుతోనే ఎక్కువ సీట్లు వచ్చాయి. 24 మందిని మార్చి ఉంటే భారాస మళ్లీ గెలిచేది. అప్పట్లో ఆ పార్టీ నేతలకు అహంకారం ఉండేది. ఎక్కువ మంది సంతానం ఉండాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. అదే విషయాన్ని నేను చెప్పి ఉంటే రాద్ధాంతం చేసేవారు. దక్షిణ భారత్‌లో జననాల రేటు తక్కువగా ఉందని చంద్రబాబు గుర్తించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి నష్టం. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గుతుంది. బాగా పనిచేసిన రాష్ట్రాలను ప్రోత్సహించకుండా శిక్షిస్తే ఏం లాభమని అసదుద్దీన్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్‌తోజతకట్టడం బాలాసాహెబ్ ఆశయాలకు వ్యతిరేకం

### అందుకే బిజెపితో కలసి ప్రయాణిస్తున్నాం

### ఉద్ధవ్ తీరుపై మండిపడ్డ ఏక్‌నాథ్ షిండే

ముంబయి,నవంబర్ 2 : మహారాష్ట్రలో ఎన్నికల రాజకీయాలు వేడెక్కాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈక్రమంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేపై తీవ్ర విమర్శలు చేశారు. 'నేను మహావికాస్ అఘాడి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండేవాణ్ణి. ఆ ప్రభుత్వం బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తుంది. శివసేన, భాజపాలు సరైన మార్గంలోనే వెళుతున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే ఆయన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. ఇది బాలాసాహెబ్ ఎప్పుడూ కోరుకోలేదు. శివసేన కార్యకర్తలుగా పార్టీ క్రమశిక్షణను అనుసరిస్తూ.. మార్పు అవసరమని గ్రహించాం. అందులోభాగంగానే భాజపాతో పొత్తు పెట్టుకున్నాం. సీఎంగా ప్రజలకు సేవ చేయడం అంటే ఆఫీసులో ఉండి, ఫేస్‌బుక్ లైవ్‌లో ప్రభుత్వాన్ని నడపడం కాదు. ప్రజల మధ్యలో ఉండి పాలన చేయాలని ఉద్ధవ్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యకు సంబంధించిన నిందితులను వదిలిపెట్టేది లేదని ఏక్‌నాథ్ శిందే పేర్కొన్నారు. 'శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ ఘటన చాలా దురదృష్టకరం. ఈ హత్యకు సంబంధించిన పలువురు నిందితులు ఇప్పటికే అరెస్ట్ అయ్యారు. ఇందులో భాగస్వాములైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది' అని తెలిపారు. ఇక, మొత్తం 288 స్థానాలకు ఈనెల 20న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.

## బిసి రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలు

### మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ సూచన

హైదరాబాద్,నవంబర్ 2 : బిసి రిజర్వేషన్లు ఖరారు అయ్యాకనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై చట్టం చేస్తే సహకరిస్తామన్నారు. చట్టం లేకుండా రిజర్వేషన్లు పెరగవని పేర్కొన్నారు. బిహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్ల పెంపును కోర్టులు కొట్టేశాయని గుర్తుచేశారు. ప్లానింగ్ కమిషన్, బీసీ కమిషన్‌పై ప్రభుత్వం 2 జీవోలు మాత్రమే ఇచ్చిందని మాజీ మంత్రి, భారాస నేత శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బీసీ కమిషన్ జిల్లాలకు పోతే ఎవరూ పట్టించుకోవడం లేదు. కమిషన్‌ను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దాన్ని నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

## సిఎం రేవంత్ కుర్చీ గురించి కాదు..

### మీ పార్టీలో విభేదాలు పరిష్కరించుకోండి

### ఏలేటికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన ఎంపి మల్లు రవి

హైదరాబాద్,నవంబర్ 2 : ఈ ఐదేళ్లు..మరో పదేళ్లు సిఎంగా రేవంత్ రెడ్డి ఉంటారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. కొందరు తమ ప్రచారం కోసం లేనిపోని ప్రకటనలు చేస్తున్నారని భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి మాత్రమే కాదు.. మరో పదేళ్లపాటు సీఎంగా కొనసాగుతారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై మహేశ్వర్ రెడ్డి మాట్లాడిన తీరు అతని రాజకీయ అజ్ఞానానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. మహేశ్వర్ రెడ్డికి భాజపాలో పని ఏమీ లేక పగటి కలలు కంటూ ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేస్తున్నారంటూ.. మల్లు రవి ఓ ప్రకటనను విడుదల చేశారు. భాజపాలో రోజురోజుకూ ముదిరిపోతున్న విభేదాలు, వర్గపోరు నుంచి అందరి దృష్టిని మరల్చేందుకు ఇలాంటి జాతకాలు చెబుతున్నారని దుయ్యబట్టారు.

## నిజామాబాద్ జిల్లాలో దట్టమైన పొగమంచు

### పలు జిల్లాల్లోనూ పొగమంచు ఆవరింపు

నిజామాబాద్,నవంబర్2 : నిజామాబాద్ జిల్లాలో దట్టమైన పొగమంచు ఆవరించింది. వేకువ జామున భారీగా పొగమంచు కురవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇందూరు పట్టణంలో కనుచూపుమేరలో పొగ మంచు నెలకొంది. ముందు వెళున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ముందుకు సాగారు. చలితో ప్రజలు వణికిపోయారు. అదేవిధంగా మంచిర్యాల జిల్లాలో కూడా పొగమంచు భారీగా గురిసింది. జిల్లాలోని జన్నారం, దండేపల్లి మండలాల్లో పొగమంచు అలముకున్నది. వికారాబాద్ జిల్లాలోనూ పొంగమంచు ఆవరించింది. శనివారం ఉదయం వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండల పరిసరాలను మంచు దుప్పటి కమ్మేసింది. పొగమంచు ప్రభావంతో పరిసరాలు స్పష్టంగా కన్పించని పరిస్థితి నెలకొంది. ఉదయం పూట జనం ఇళ్లనుంచి బయటకు రావడం లేదు. వికారాబాద్ జిల్లాలో పొగమంచు కమ్ముకుంది. ఉదయం ఏడున్నర గంటలైనా రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది. రోడ్డు కనిపించకపోవడంతో వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వేసుకొని మరి ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. అనంతగిరి కొండల్లో చూపరులను మంచు ఆకట్టుకుంటుంది. అనంతగిరి కొండల్లో అడవులు అరకు అందాలను తలపిస్తున్నాయని ప్రజలు అన్నారు.ఉదయం తొమ్మిదింటి వరకూ పొగమంచు కమ్ముకుంటోంది. గాలిలో తేమశాతం పెరగడంతో ఉదయం వేళల్లో వికారాబాద్ జిల్లాలోని చాలా గ్రామాల్లో పొగమంచు కమ్ముకుంటోంది. తెల్లవారుజామున 5గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు గ్రామాలతో పాటు రహదారులను మంచు తెరలు కమ్మేస్తున్నాయి.అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఉన్ని దుస్తులు వినియోగించాలని వైద్యులు సలహాలు ఇస్తున్నారు.

## రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న చలి

హైదరాబాద్,నవంబర్ 2 : తెలంగాణలో క్రమంగా చలి ప్రభావం మొదలైంది. దీపావళికే తీవ్ర చలి ఉండాల్సి ఉండగా కొంత ఆలస్యంగా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఇలా చలి తీవ్రతను పెంచుతున్నాయి. చలి ప్రభావంతో జనం గజగజ వణుకుతున్నారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండటంతో చలి తీవ్రత పెరుగుదలకు కారణమైంది. సాయంత్రం ఆరు గంటలు అయ్యిందంటే ప్రజలు చలికి ఇళ్ల తలుపులు మూసుకుంటున్నారు. మళ్లీ ఉదయం ఎనిమిది గంటలు అయితేగానీ తలుపులు తీయడం లేదు. అప్పటి వరకు రోడ్లు కూడా నిర్మానుష్యంగా మారుతున్నాయి. చలి తీవ్రతకు చిన్నపిల్లలు, వృద్ధులు, బస్టాండ్లు, రహదారులపై యాచకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లే జనం, పాల వ్యాపారులు, పేపర్ బాయ్స్, మునిసిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనులు, అవసరాల రీత్యా తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై తిరిగేవారు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చలిమంటలు కాచుకుంటున్నారు. సంక్రాంతి, శివరాత్రి ముగిసేవరకు చలి తీవ్రత తీవ్రంగా ఉండనుంది.

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక శోభ

### శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

### నదీస్నానాలకు ప్రాధాన్యం



హైదరాబాద్,నవంబర్2 : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. శనివారం నుంచి కార్తీక ప్రవేశంతో శైవాలయాలు కిటకిటలాడాయి. అలాగే నదీతీరాలు, సముద్ర తీరాల్లో పవిత్ర స్నానాలకు ప్రజలు చేరుకున్నారు. నదీతీర శైవ క్షేత్రాలు కార్తికమాసం శోభను సంతరించుకున్నాయి. కార్తికమాసం తొలిరోజు కావడంతో శనివారం తెల్లవారుజాము నుంచి మహిళలు, భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మహాశివునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ముక్కంటి సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్నారు. భద్రాచలంలో పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. కార్తిక దీపాలు వదులుతున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణ మండపంలో కార్తిక పురాణ ప్రవచనం గావిస్తున్నారు. రాజన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం సామూహిక కార్తిక దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గోదావరి, కృష్ణా తీరంలోని శైవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేకువజామునే స్వామివారిని దర్శించుకున్న భక్తులు, కార్తిక దీపాలు వెలిగించారు. కాగా, కార్తికమాసం సందర్భంగా భక్తుల కోసం పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నది. వివిధ డిపోల నుంచి అన్నవరం, కాళేశ్వరం, శ్రీశైలం, అరుణాచలం, వేములవాడతోపాటు ప్రసిద్ధ శివాలయాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేసింది. శ్రీశైలం, శ్రీకాళహస్తి, అన్నవరం, పట్టిసీమ, ద్రాక్షారామం, సామర్లకోట తదితర క్షేత్రాల్లో భక్తులు ఉదయం నుంచే దర్శనాలకు వచ్చారు.

## ఎక్స్ ఉద్యోగులకు ఎలాన్ మస్క్ షాక్

న్యూఢిల్లీ, నవంబర్ 2 : ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం సంకేతాల నేపథ్యంలో దాదాపు అన్ని సంస్థలు తమ ఉద్యోగుల్ని ఎడాపెడా పీకేసిన విషయం తెలిసిందే. చిన్నా, పెద్ద కంపెనీలన్న తేడా లేకుండా అన్ని సంస్థలూ ఉగ్యోగులకు లేఆఫ్స్ ప్రకటించాయి. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. విడతల వారీగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. తాజాగా బిలియనీర్ ఎలాన్ మస్క్ ఆధీనంలోని మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. నవంబర్ 5న జరగున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రమోట్ చేయడంలో బిజీగాఉన్న మస్క్.. తన ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు తెలిసింది. తాజా రౌండ్‌లో ఎక్స్‌లోని ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులను తొలగించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే ఎంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నది ఇంకా స్పష్టత రాలేదని సదరు నివేదిక తెలిపింది. రెండు నెలల క్రితం కంపెనీకి సంబంధించిన విషయాలపై ఉద్యోగులకు ఓ పేజీ నివేదిక ఇవ్వాలని ఎక్స్ కోరింది. దాని ఆధారంగా ఉద్వాసన పలికినట్లు సదరు నివేదిక పేర్కొంది. ఉద్యోగులకు మెయిల్స్ ద్వారా లేఆఫ్స్ సమాచారం అందించినట్లు తెలిసింది. అయితే, ఈ తాజా లేఆఫ్స్‌పై ఎక్స్ బహిరంగంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

## ఇంపోర్టెడ్ మాల్ వ్యాఖ్యలను సమర్థించిన సంజయ్‌రౌత్

ముంబై, నవంబర్ 2 : ఉద్దవ్ ఠాక్రేకు చెందిన శివసేన పార్టీ ఎంపీ అరవింద్ సావంత్.. షిండే వర్గానికి చెందిన శివసేన నేత షైనా ఎన్‌సీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె ఇంపోర్టెడ్ మాల్ అంటూ ఆయన విమర్శించారు. ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలను శివసేన నేత సంజయ్ రౌత్ సమర్థించారు. తమ పార్టీ ఎంపీని ఆయన డిఫెండ్ చేసుకున్నారు. తమ నేత ఎవరినీ అవమానించలేదని, అరవింద్ సావంత్ తమ సీనియర్ ఎంపీ అని, ముంబాదేవి స్థానానికి చెందిన బీజేపీ నేత షైనా ఎన్సీ బయటి వ్యక్తి అని, ఆమె ముమ్మాటికీ ఇంపోర్టెడ్ మాల్ అని రౌత్ అన్నారు. ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యల్లో.. మహిళలను అవమానించినట్లు లేదని ఆయన అన్నారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ గురించి మీరెటువంటి వ్యాఖ్యలు చేశారో గుర్తు లేదా అని రౌత్ విమర్శించారు. బయిటి వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేస్తే, వాళ్లు బయటి నుంచి వచ్చారనే చెబుతామన్నారు. దీంట్లో పెద్ద రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అరవింద్ సావంత్ చేసిన వ్యాఖ్యలను షైనా ఎన్సీ ఖండించారు. మాల్‌ను కాదు.. మహిళను అంటూ ఆమె పేర్కొన్నారు. సెక్షన్ 79, సెక్షన్ 356(2) కింద ముంబై పోలీసులు కేసు బుక్ చేశారు.

### విషవాయువు లీకే 30 మంది కార్మికులకు అస్వస్థత

న్యూఢిల్లీ, నవంబర్ 2 (ఆర్ఎన్ఎ): అమరావతి : బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలో రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో విషవాయువు లీకై 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం కంపెనీలోని పైపులైన్ నుంచి లీకేజీ ఏర్పడి విషవాయువు వెలువడింది. దీంతో అక్కడే పనిచేస్తున్న సుమారు 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతలోనయ్యారు. కార్మికులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు మండడం , కళ్లు ఎర్రగా కావడంతో వారిని నిజాంపట్నం , పిట్టవానిపాలెం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు బాపట్ల, గుంటూరు ఆస్పత్రికి తరలిస్తున్నారు.



# తారాస్థాయికి అమెరికా అధ్యక్ష ఎన్నికలు

## జాతీయ అందర్జాతీయ పరిణామాలపై ప్రకటనలు

## పోటాపోటీగా విమర్శలతో పదునెక్కుతున్న ప్రచారం

వాషింగ్టన్,నవంబర్ 2 : అమెరికా అధ్యక్ష ఎన్నికలు తారాస్తాయికి చేరుకున్నాయి. మరి కొద్ద ఇరోజుల్లో ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ప్రధాన అభ్యర్థులు ట్రంప్, కమలా హారిస్ ప్రచారం ఉధృతం చేశారు. తాజాగా దేశ ఆర్థిక విధానాలపై ప్రకటనలు చేస్తున్నారు. విదేవాంగ విధానంపైనా మాట్లాడు తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాను విజయం సాధించి అధికారంలోకి వస్తే దేశంలో సరికొత్త ఆర్థిక అద్భుతాన్ని సృష్టిస్తానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మిచిగాన్‌లోని డెట్రాయిట్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడుతూ డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ ఆర్థిక విధానాల్లో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ఆమె విఫల ఆర్థిక అజెండా కారణంగా ఇటీవలే ప్రైవేటురంగంలో 30 వేల ఉద్యోగాలు తుడిచిపెట్టుకుపోయాయన్నారు. తయారీరంగంలోనూ దాదాపు 50వేల ఉద్యోగాలు కోల్పోయామని పేర్కొన్నారు. హారిస్ అధికారంలోకి వస్తే ఆర్థికవ్యవస్థ విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. 'హారిస్ విధానాలు దేశాన్ని నాశనం చేసేలా ఉన్నాయి. వాటివల్ల అమెరికన్ కార్మికులు మునిగిపోతున్నారు. ఆమె ఒక రాడికల్ లెఫ్ట్ మార్క్సిస్ట్, ఎఅఇని రద్దు చేస్తానని, మీ తుపాకులు జప్తు చేస్తానని ప్రతిజ్ఞ చేసింది. కాని నేను మాత్రం దేశంలో ఉన్న ద్రవ్యోల్బణాన్ని అంతం చేస్తానని, పన్నులు

తగ్గిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వేలకొద్దీ కర్మాగారాలను అభివృద్ధి చేస్తాను. నా పాలనలో హింసాత్మక నేరాలు జరగకుండా అణచివేస్తాను' అని పేర్కొన్నారు. దేశ సమస్యలే కాకుండా ప్రపంచదేశాల పరిస్థితులను నిరంతరం గమనిస్తుంటానని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను నివారించడానికి, రష్యా- ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నిస్తానన్నారు. మూడో ప్రపంచయుద్ధం రాకుండా నిరోధిస్తానని హామీ ఇచ్చారు. అమెరికా సైన్యాన్ని బలోపేతం చేయడానికి, ఆధునికీకరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద క్షిపణి రక్షణ కవచాన్ని నిర్మిస్తామన్నారు. పిల్లలు, యువతకు దేశాన్ని, మన చరిత్రను, జెండాను గౌరవించడం నేర్పిస్తానన్నారు. జెండాను అగౌరవపరిచినవారికి ఒక ఏడాది జైలు శిక్ష విధిస్తానని పేర్కొన్నారు. దేశ పౌరుల మతపరమైన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని పునరుద్ధరిస్తానన్నారు. దేశ సరిహద్దులను కాపాడుకుంటూ అక్రమ వలసలను నివారిస్తామని ట్రంప్ అన్నారు. ఇకపోతే ట్రంప్ విధానాలను కమలా ఎండగుడుతున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజల్లో విద్వేషాలు రేకెత్తిస్తున్నారని డెమోక్రాటిక్ అభ్యర్థి కమలాహారిస్ అన్నారు. అమెరికాకు ట్రంప్ కంటే మెరుగైన అధ్యక్షుడు అవసరమని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇక్కడి ప్రజల పాత్ర, బాధ్యతలను అర్థం చేసుకొనే వ్యక్తి వారికి కావాలని, ప్రపంచానికే ఆదర్శంగా కనిపించే నాయకుడు అమెరికా అధ్యక్షుడిగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. కానీ ట్రంప్ అమెరికన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కాకుండా తన రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవడంపై దృష్టిపెడతారని హారిస్ అన్నారు.

# 13న తిరుమలలో కైశిక ద్వాదశి

## సూర్యోదయానికి ముందే మాడవీధుల్లో ఊరేగింపు




తిరుమల,నవంబర్ 2 : తిరుమలలో నవంబరు 13వ తేదీన కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టిటిడి ఘనంగా నిర్వహించనుంది. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. చారిత్రక వివరాలలోనికి వెళితే కైశిక ద్వాదశిని ప్రబోధనోత్సవం అని, ఉత్తానద్వాదశి అని కూడా వ్యవహరిస్తారు. వివిధ గ్రంథాల్లో పేర్కొన్న విధంగా స్థితికారుడైన శ్రీమహావిష్ణువును మేల్కొల్పే పర్వదినాన్ని కైశికద్వాదశిగా వ్యవహరిస్తారు. శ్రీమహావిష్ణువు ఆషాఢశుక్ల ఏకాదశినాడు గాఢ నిద్రలోకి వెళ్ళారు. కైశికద్వాదశినాడు ఆయనను మేల్కొల్పు చేయడం రివాజు. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు స్వరూపంగా భావించే కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైవున్న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి మహోత్సవాన్ని ప్రతిఏటా టిటిడి

ఘనంగా నిర్వహిస్తుంది.పురాణాల ప్రకారం శ్రీవైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ స్వామి కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగా పిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది. కైశికద్వాదశి పురాణ నేపథ్యం విశేష ఘట్టాలతో కూడుకున్నది. శ్రీనంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించడానికి వెలుతుండగా మార్గమధ్యంలో ఒక బ్రహ్మరాక్షసుడు తారసపడి తినేస్తానన్నాడు. అందుకు నంబదువాన్ సమాధానంగా తాను ప్రస్తుతం శ్రీవారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నానని తప్పక తిరిగివచ్చి ఆ బ్రహ్మరాక్షసుని క్షుద్బాధను తీరుస్తానని ప్రమాణం చేశాడు. అన్న ప్రకారం స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించి బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చాడు. భక్త నంబదువాన్ భక్తికి, సత్యనిరతికి ముగ్ధుడై స్వామివారు మోక్షం ప్రసాదించారు. ఈ విధంగా ఉత్తానద్వాదశికి కైశికద్వాదశి అనే నామకరణం కలిగింది. 14వ శతాబ్దంలో ఉగ్రశ్రీనివాసమూర్తి ఊరేగింపు జరుగుతూ ఉండగా సూర్య కిరణాలు స్వామివారి విగ్రహం మీద పడగానే భాగీ అగ్ని ప్రమాదం జరిగింది. అప్పటి నుండి సూర్యోదయానికి ముందే ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా సూర్యోదయానికి ముందే తెల్లవారుఝామున ఆలయ అర్చకులు తిరుమాడ వీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఆలయం లోపల ఉదయం 6 నుండి ఉదయం 7.30 గంటల వరకు కైశిక ద్వాదశి ఆస్థానాన్ని పురాణ పారాయణం ద్వారా ఘనంగా నిర్వహిస్తారు. దీనితో సాలకట్ల కైశికద్వాదశి ఉత్సవం పూర్తవుతుంది.

# సర్వేలో సమగ్రత లోపించరాదు!

ఓ దశాబ్దం క్రితం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత...కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక సమగ్ర సర్వే అనేది ఒకటి చేపట్టారు. అప్పుడు ప్రజలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. ఇప్పుడు మరోమారు కులగణన చేపట్టబోతున్నారు. ఆనాటి సర్వే వివరాలు ఏమయ్యాయో అని నేటి ప్రభుత్వం చెబుతోంది. సర్వే వివరాలను కూడా ఏం చేశారో నాటి కెసిఆర్ సర్కార్ లోని అధికారులు కూడా చెప్పడం లేదు. ప్రభుత్వం అంటే ఇది కాంగ్రెస్, కెసిఆర్ వ్యవహారం కాదు. ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారం . ఆనాడు సర్వేలో పాల్గొన్న అధికారులు ఉన్నారు. ఆ వివరాలు ఏమయ్యాయో నిలదీయాలి. అలాగే సర్వ ఏ వివరాలను పబ్లిక్ డాక్యుమెంట్ చేయాలి. కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా కార్యక్రమాలు చేపట్టడం, దాచి పెట్టడం సరికాదు. రోజు ట్విట్టర్ లేదా, మీడియా ముందు అనేక విషయాలు పంచుకుంటున్న కెటిఆర్, హరీష్ రావులు, వారి అనుచరగణం ఆనాటి సర్వే వివరాలను వెల్లడించాలి. ఎక్కడ ఏం చేశారో చెప్పాలి. ఇది ప్రజల డిమాండ్‌గా గుర్తించాలి. ఎందుకంటే ప్రభుత్వం బిసి కులగణనతో మారోమారు జనంలోకి వెళుతున్న వేళ గతంలో చేపట్టిన సర్వే వివరాలను వెల్లడించాలి. ఇదేమీ రహస్య డాక్యుమెంట్ కాదని గుర్తించాలి. అలాగే ఇది తమ వ్యక్తిగతం అనుకోవడానికి కూడా లేదు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 6వ తేదీ నుంచి ఇంటింటికి సమగ్ర సర్వే కు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దపడింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే ఆధారంగా కులగణనను చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే దీనికోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే బిసి కమిషన్, పిసిసి ఎవరి స్థాయిలో వారు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనిలో పనిగా సర్వేలో అన్న వివరాఉల రాబట్టాలి. కులాలతో పాటు,ప్రజల ఆర్థిక స్థితిగతులు, నిరుద్యోగులు సంఖ్య, అక్షరాస్యుల సంఖ్య, రేషన్ కార్డుల వివరాలు ఇలా మొత్తం వివరాలు సేకరించాలి. దీంతో ప్రజలకు ఏ పథకం అందాలో..అందకూడదో కూడా తెలుసుకునే అవకాశం వస్తుంది. ప్రజల సొమ్ముతో అనేక పథకాలు ప్రవేశ పెట్టిన ప్రభుత్వం..అవి సక్రమంగా పేదలకు అందుతున్నాయో లేదో కూడా తెలుసుకోవాలి. దుబారా అవుతుంటే గుర్తించాలి. ఇందిరమ్మ ఇళ్లు ఇసతామంటున్న క్రమంలో ఇళ్లు లేని వారి ఆర్థిక స్థితిగతులను కూడా గుర్తించాలి. ఈ సర్వే దేశానికి దిక్సూచి కావాలని కోరుకుంటున్న సిఎం రేవంత్ అందుకు అనుగుణంగానే సర్వేకు సంబంధించిన విధివిధానాలు ఉండేలా చూసుకోవాలి.అన్ని జిల్లాల్లో ఈ సర్వేపై సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ శ్రేణులను అందుకు సమాయత్తం చేయాలి. పిసిసి అధ్యక్షుడు ఇప్పటికే అన్ని జిల్లాల డిసిసి అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే డిసిసి అధ్యక్షులు, మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు,టిపిసిసి ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్‌లు, వ్యవసాయ మార్కెట్, దేవాలయ, గ్రంథాలయ కమిటీలు, సీనియర్ నాయకులు కూడా సర్వేలో పాల్గొని ఆయా జిల్లాల్లో కులగణన ప్రాధాన్యత, ప్రచార అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన కోసం ప్రభుత్వం ఇప్పటికే జీఓ నెం 199 ద్వారా బిసి కమిషన్ చైర్మన్‌గా నిరంజన్‌ను, రాపోలు జయ ప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మిలను మెంబర్లుగా నియమించింది. ఇక రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్ మెంట్‌ను నోడల్ డిపార్ట్ మెంట్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ పౌరులతో పాటు ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలపై ప్రణాళికలు రచ్చించి వాటిని అమలు చేయడం కోసం ఫిబ్రవరిలోనే శాసనసభలో ఈ సర్వే కోసం ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇంటింటికి సమగ్ర సర్వే ,కులగణనను సంబంధించిన



ప్రశ్నావళిని ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 56 ప్రధాన ప్రశ్నలతో పాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలను ఖరారు చేసింది. పార్ట్-1లో యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలుండగా పార్ట్-2లో కుటుంబ వివరాలకు సంబంధించి 17 ప్రశ్నలున్నాయి. మొత్తం 7 పేజీల్లో వీటిని పూరించాల్సి ఉంటుంది. కుటుంబ యజమానితో పాటు కుటుంబంలోని సభ్యుల వ్యక్తిగత వివరాలను ప్రభుత్వం సేకరించనుంది. పార్ట్-1లో వ్యక్తిగత వివరాల్లో మతం, సామాజిక వర్గం, కులం, ఉప కులంతో పాటు మాతృభాష, వైవాహిక స్థితి, పాఠశాల రకం, విద్యార్హత, ఉద్యోగం, ఉపాధి, కుల వృత్తి, వార్షిక ఆదాయం, ఐటి రిటర్న్, స్థిరాస్తులు, ధరణి పాసుబుక్ నెంబర్, రిజర్వేషన్‌తో పొందిన ప్రయోజనాలు, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన సంక్షేమ పథకాల పేర్లు, రాజకీయ నేపథ్యం, వలస వివరాలను సేకరిస్తారు. ఇందులో ఇంకా ఏమైనా వివరాలు అవసరమో గుర్తించాలి. ఈ గణన తెలంగాణ అభివృద్ధికి కేంద్రంగా కావాలి. ప్రభుత్వానికి ఓ సమగ్రమైన నివేదికలా ఉండాలి. ఏ కార్యక్రమం చేపట్టాలన్నా, పథకాలు రచించాలన్నా ఇదో నిఘంటువులా ఉండాలి. ఇకపోతే కుటుంబ వివరాలు పార్ట్-2లో నమోదు చేస్తారు. ఇందులో గత ఐదేళ్లలో తీసుకున్న రుణాల వివరాలు, పశు సంపద, స్థిరాస్తి, చరాస్తి వివరాలు, రేషన్ కార్డు నెంబర్, నివాస గృహం రకం, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్ వివరాలు తెలపాల్సి ఉంటుంది. ఆధార్ వివరాలు తప్పనిసరి కాదని ఇందులో స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే లాంటి ప్రశ్నలనే ప్రభుత్వం ఇందులో పొందుపరిచింది. అయితే ఆధార్ కూడా పొందు పర్చాలి. ఓటరు వివరాలను కూడా పొందుపరిస్తే మంచిది.

గత ప్రభుత్వంలో జరిగిన సర్వేలో 8 అంశాలు, 94 ప్రశ్నలు చేరుస్తూ 2014 ఆగస్టు-19వ తేదీన సమగ్ర కుటుంబ సర్వే ద్వారా రాష్ట్రంలోని కోటి గృహాలు, 3.68 కోట్ల జనాభాకు సంబంధించి ఆర్థిక సామాజిక వివరాలను సేకరించింది. ఆ వివరాలు లేవంటున్నారు. అప్పటితో పోలిస్తే ఈ కులగణన సర్వేలో దాదాపు 90శాతం ప్రశ్నలు మళ్లీ పునరావృతం అయ్యాయి. కుటుంబసభ్యుల అనారోగ్య వివరాలు అందులో ఉండగా ఇప్పుడు కులాలకు సంబంధించిన ప్రశ్నలు అదనంగా ఉన్నాయి. గతంలో ఆధార్ వివరాల నమోదు తప్పనిసరి చేయగా ఇప్పుడు ఐచ్ఛికంగా ఉంచారు. అయితే సర్వే అన్నప్పుడు ఒక్కో కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలు తీసుకుంటేనే సమగ్రంగా ఉంటుంది. అలాగే భూములు, పశువుల వివరాలు కూడా కుటుంబ సభ్యుల ద్వారానే తెలుస్తాయి అవి కూడా సేకరించాలి. అప్పుడే సమగ్ర సర్వేకు అర్థం ఉంటుంది. ఈ దిశగా సర్వే విధానాలతో ముందుకు సాగితే మంచిది.

# శ్రీశైల మల్లన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు

## నెల రోజులపాటు గర్భాలయ దర్శనాల నిలిపివేత




శ్రీశైలం,నవంబర్ 2 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైల మల్లన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికంగా ది వ్యమైనదిగా భావించే ఈ మాసంలో మల్లికార్జున స్వామివారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈనేపథ్యంలో నెల రోజులపాటు గర్భాలయ దర్శనాల ను అధికారులు నిలిపివేశారు. అదేవిధంగా శని, ఆది, సోమవారాల్లో మలన్న స్పర్శదర్శనాన్ని కూడా బంద్ చేశారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు సామూహిక అభిషేకాలు, స్పర్శ దర్శనాలు యధావిధిగా కొనసాగుతాయి. కార్తికమాసంలో దీపాలు వెలిగించడాన్ని భక్తులు శుభప్రదంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉత్తర మాఢ వీధుల్లో మట్టి దీపాలు వెలిగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్తీకమాస పర్వదినాలు, సెలవు రోజులలో భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. కావున భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీక మాసమంతా కూడా గర్భాలయ ఆర్జిత అభిషేకాలను పూర్తిగా నిలిపివేశారు. అలాగే కార్తీకమాస రద్దీ రోజులలో అనగా శని, ఆది, సోమ వారాలు శుద్ధ ఏకాదశి, కార్తీక పూర్ణిమ మొదలైన రోజులు స్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలిపివేశారు. ఈ రద్దీ రోజుల్లో సామూహిక ఆర్జిత అభిషేకాలను కూడా నిలిపివేశారు. కార్తీకమాసంలో ఉచిత స్పర్శదర్శనం తాత్కాలికంగా రద్దు చేశారు. సాధారణ రోజుల్లో రోజుకు మూడు విడతలుగా స్పర్శదర్శనం, మూడు విడతలుగా సామూహిక ఆర్జిత అభిషేకాలకు అవకాశం కల్పించబడుతుంది. కాగా భక్తులు స్పర్శదర్శనం టికెట్లను, ఆర్జిత అభిషేకాల టికెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే పొందవలసి ఉంటుంది. ఇప్పటికే నవంబర్ నెల టికెట్ల కోటాను దేవస్థానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరిగింది. టికెట్ల లభ్యతను బట్టి ప్రారంభ సమయానికి కంటే ఒక గంట ముందు వరకు కూడా భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లను పొందే అవకాశం కల్పించబడింది. టికెట్లను వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు లేదా మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కూడా టికెట్లు పొందవచ్చు.

# కులగణనకు భారీగా కసరత్తు

## సమగ్ర వివరాలు సేకరణ దిశగా అడుగులు

## ప్రజలు సహకరిస్తే సజావుగా సర్వే

హైదరాబాద్,నవంబర్ 2 : నవంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బిసి కులగణన సర్వే ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే 85 వేల మంది ఎన్యూమరేటర్లు ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సైతం ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయులను కూడా ఈ సర్వేకు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల వేళలు అయిపోయిన తరువాత ఒక్కో ఉపాధ్యాయుడు ప్రతిరోజు 5 నుంచి 7 ఇళ్లను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్యుమరేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు, ఇతర సిబ్బందికి ఆకర్శణీయమైన వేతనాన్ని చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సర్వే జరిగే ప్రతి గ్రామంలో ముందుగా దప్పు చాటింపు వేయించాలని, సర్వే నిర్వహించే సమయంలో కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో తిరిగి తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

గ్రేటర్ హైదరాబద్ పరిధిలో 21 వేల మంది ఎన్యుమరేటర్‌లను ప్రభుత్వం వినియోగించుకుంటుంది. రాష్ట్రంలో కులగణనను చాలా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కూడా స్పష్టం చేశారు. ఈ కులగణన సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చినా.. తప్పుడు సమాచారం నమోదు చేసినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కులగణన సర్వే సందర్భంగా కులం పేరు తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. కులగణన బృహత్తర కార్యక్రమమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాటి కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ ఉందో తెలియదని అన్నారు. ఆ వివరాలు ఏమయ్యాయో ఆ దేవుడికే తెలుసునన్నారు. అయితే ఆనాటి వివరాలు తెలియవని అంటే సరిపోదు. అవి ఏమయ్యాయో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. సర్వేలో కేవలం బిసి జనాభా గురించి కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్దిని దృష్టిలో పెట్టుకుని అన్ని వివరాలు సేకరిస్తే మంచిది. ఈ గణన ద్వారా బీసీలతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి. 80వేల నుంచి 90వేల మంది ఎన్యుమరేటర్లు జనగణనలో పాల్గొంటారు. ఎవరూ దీన్ని రాజకీయం చేయొద్దు. అపోహలు, ఆటంకాలు సృష్టించడం మంచిది కాదని నిరంజన్ అన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి సమగ్రమైన వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కులగణన అనేది ఎక్స్ రే మాత్రమే కాదని.. హెల్త్ చెకప్ లాంటిందని కూడా సీఎం రేవంత్ అభివర్ణించారు. అందువల్ల అసమగ్రతకు తావు లేకుండా సాగాల్సి ఉంటుంది.

# ఉత్తర సెర్బియాలో ఘోర ప్రమాదం

## రైల్వే స్టేషన్ పైకప్పు కూలి 14 మంది మృతి

న్యూఢిల్లీ,నవంబర్ 2 : ఉత్తర సెర్బియాలో ఘోర ప్రమాదం జరిగింది. రైల్వే స్టేషన్ పైకప్పు కుప్పకూలిపోవడంతో 14 మంది మృతి చెందారు. శుక్రవారం నోవి సాడ్ రైల్వే స్టేషన్ కాంక్రీట్ పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో ఒక చిన్నారి, ఓ విదేశీయుడు సహా కనీసం 14 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో చాలా మంది శిథిలాల కింద చిక్కుకున్నారని.. వారిని రక్షించేందుకు రెస్క్యూ టీమ్ శ్రమిస్తున్నారని అధికారులు చెప్పారు. బయటకు తీసుకొచ్చిన పలువు క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనాస్థలంలో 80 మంది రెస్క్యూ వర్కర్లు శిథిలాలను తొలగిస్తున్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని మంత్రి ఐవికా డాసిక్ వెల్లడించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 3 నవంబర్ 2024



# అధికారం అడ్డం పెట్టుకుని అక్రమాలు

**రాజభోగాల కోసం ప్యాలెస్‌ల నిర్మాణం**

**పర్యావరణ విధ్వంసంతో రుషికొండలో ప్యాలెస్‌లు**

**భోగ విలాసాల కోసం ప్రజాధనం దుర్వినియోగం**

**జగన్ తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు**



విశాఖపట్టణం,నవంబర్ 2 : రుషికొండ నిర్మాణాలు చూస్తే గుండె చెదిరే నిజాలు వెలుగు చూస్తున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం అడ్డు పెట్టుకొని చేసే తప్పులకు ఇదో కేస్ స్టడీ అంటూ మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటివి సాధ్యమా అనిపించిందని.. కలలో కూడా ఊహించలేమన్నారు. ఇటువంటి నేరాలు చెయ్యాలంటే చాలా తెగించాలి.. ఒక వ్యక్తి విలాసాల కోసం ఇంత దారుణమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చాలా దేశాలు తిరిగానని, పాలకులను చూశాను కానీ ఒక సీఎం విలాసం కోసం పర్యావరణ విధ్వంసం చేసి ప్యాలెస్ నిర్మించుకోవడం చేయలేదన్నారు. ఒక ముఖ్యమంత్రి విలాసం కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి ప్యాలెస్ కట్టుకోవడం ఎక్కడా చూడలేదని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో రుషికొండపై నిర్మించిన భవనాలను మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎవరూ కలలో కూడా ఊహించనిది జరిగింది. ఒక వ్యక్తి విలాసవంతమైన జీవితం కోసం ఏవిధంగా కార్యక్రమాలు చేస్తాడనేది ఇక్కడి భవనాలు చూశాకే తెలిసింది. గుండె చెదిరిపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. గతంలో.. మీడియా, ఇతరులు ఎంత ప్రయత్నించినా రుషికొండపై ఏం చేస్తున్నారో తెలియకుండా చేశారు. ఎన్జీటీ, హైకోర్టు, కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టారు. ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని ఏ విధంగా చేయగలరో అనే దానికి ఇక్కడి పరిస్థితి ఒక ఉదాహరణ. నేను, నా మిత్రుడు పవన్ కల్యాణ్ కూడా ఇక్కడకు రావాలని ప్రయత్నించాం. ఎవరినీ రానీయకుండా చేశారు. ఇవాళ ఇక్కడ ఏం జరిగిందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది.. ఆ అధికారం ప్రజలే మాకు ఇచ్చారు. రుషికొండ బీచ్.. విశాఖలోనే అత్యంత అందమైన ప్రాంతం. భవనాల్లో ఎక్కడ కూర్చున్నా సముద్రం వ్యూ కనిపించేలా కట్టారు. పూర్వం రాజులు, చక్రవర్తులు కూడా ఇలాంటి భవనాలు నిర్మించుకోలేదని చంద్రబాబు అన్నారు. ఒక వ్యక్తి తన స్వార్థం కోసం ఇలాంటి పనులు చేశారు. ఇలాంటి విలాసవంతమైన భవనాలు నిర్మిస్తున్నారని ఊహించలేం. ప్రజాధనంతో ఇలాంటి భవనాలు కట్టుకోవడం దారుణం. ఈ భవనాలు చూసి ఆశ్చర్యం, ఉద్వేగం కలిగింది. బాత్ టబ్ కోసం రూ.36లక్షలు ఖర్చు చేశారు. ఫ్యాన్సీ ఫ్యాన్లు పెట్టారు. ఇలాంటి షాండ్లియర్లు కూడా నేనెక్కడా చూడలేదు. భవనాలకు మార్బుల్స్ విదేశాల నుంచి తీసుకొచ్చారు. చాలా దేశాలు తిరిగా.. ఎంతో మంది నేతలను చూశాను కానీ, ఎవరూ ఇలాంటి ప్యాలెస్‌లు కట్టుకోలేదు. దిల్లీ పెద్దలు కూడా విశాఖలోని నేవీ గెస్ట్‌హౌస్‌లోనే ఉన్నారు. పర్యాటకశాఖ కోసమే నిర్మించామని అనేకసార్లు చెప్పారు. పేదలను ఆదుకుంటామనేవారు ఇలాంటివి కట్టుకుంటారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.400 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఈ నిధులు ఖర్చు పెడితే రోడ్లపై గుంతలు పూడ్చటం పూర్తయ్యేది. ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో పనికివస్తారా? ప్రజలు ఆలోచించాలి. ఈ భవనాలు అందరికీ చూపిస్తాం. వీటిని దేనికి వాడుకోవాలో నాకు అర్థం కావడం లేదు. ఇక్కడ క్యాంప్ ఆఫీస్ కట్టడం ఏమిటో అర్థం కాలేదు. ప్రజలంటే ఎంతో కొంత భయం ఉంటే సమాధానం చెప్పాలి. ప్రజాధనం దోచుకుని గతంలో ఊరికొక ప్యాలెస్ కట్టుకున్నారు. అధికారంలో శాశ్వతంగా ఉంటాననే భ్రమలతో ఇలాంటివి కట్టారు. విశాఖ ప్రజలను మోసం చేసేందుకు ఇలాంటి తప్పుడు పనులు చేశారు' అని చంద్రబాబు విమర్శించారు.నిర్మాణ వ్యయం బిల్లులు అన్నీ ప్రజల ముందు పెడతామన్నారు. టబ్ కోసం 36లక్షలు, కమోడ్ కోసం 12లక్షలు ఖర్చు చేశారని చెప్పారు. 9.88ఎకరాల్లో ఏడు బ్లాకుల్లో విలాసవంతమైన భవనాలు నిర్మించారని చెప్పారు. 13వేల 543చదరపు మీటర్ల నిర్మాణం జరిగిందన్నారు. అదిరిపోయే బిల్డింగ్‌లు నిర్మించి కొండను తొలిచేసి కొండ చరియలు విరిగిపడకుండా జపాన్ టెక్నాలజీ వాడారని వెల్లడించారు. వైట్ హౌస్, రాష్ట్ర పతి భవన్‌లో కూడా లేని కారిడార్లు నిర్మించారని చెప్పారు. చాలా దేశాలు తిరిగాను కానీ దొంగలకు ఇంత ఇన్నోవేషన్ ఎలా వచ్చిందా?అని ఆశ్చర్యం కలుగుతుందన్నారు. రుషికొండ మీద విచారణ చేస్తే చాలా మంది ఉద్యోగాలకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. జగన్ ఆంధ్రా ఎస్కో బార్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాధనం అంటే లెక్క లేకుండా వ్యవహరించారన్నారు. సర్వే రాళ్లపై బొమ్మ కోసం 700కోట్లు పైగా ఖర్చు చేశారన్నారు. భోగ విలాసాల కోసం ప్రజాధనం దుర్వినియోగం

జరిగిందన్నారు. రుషికొండ నిర్మాణాలపై చర్చ జరగాలని.. ప్రజలు కూడా దీనిపై అభిప్రాయం చెప్పొచ్చన్నారు. ఋషికొండను ఏం చెయ్యాలో తనకు అర్థం కావడం లేదన్నారు. రుషికొండలో ప్రజా ధనం దుర్వినియోగంపై వైసీపీ నాయకత్వం సమాధానం చెప్పాలన్నారు. విశాఖ రాజధాని పేరుతో మభ్య పెట్టి ప్రజలను మోసం చేసే ప్రయత్నం జరిగిందన్నారు. ఒక రాజకీయ నాయకుడు తప్పుడు పనులు చేసి ఎదురు దాడికి పాల్పడటానికి ఇది నిదర్శనమన్నారు. ప్రజా కోర్టులో రుషికొండలో జరిగిన నేరంపై చర్చ జరగాలన్నారు. ఇక్కడ విలాసవంతమైన భవనాలు చూసి మైండ్ బ్లాంక్ అయిందన్నారు. పర్యాటక శాఖకు కూడా రుషికొండ కాస్ట్లీ ఫ్గ÷ర్ అయ్యిందన్నారు. రుషికొండ కోసం ప్రజాస్వామ్యం భారీ మూల్యం చెల్లించిందన్నారు. రుషికొండ చర్చ అవసరం లేదు శిక్ష మిగిలింది.. అందులో ప్రభుత్వం వెయ్యాలిసింది.. ప్రజలు వెయ్యాలసినది మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. ప్రజా చైతన్యం కోసం పోలవరం చూపించాం.. ప్రజాస్వామ్యంలో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో చూడాలంటే రుషికొండ రావాలన్నారు. రుషికొండ నిర్మాణ, నిర్వహణ వ్యయం భారీగా ఉందన్నారు. తాను ఓపెన్ మైండ్‌తో ఉన్నానన్నారు. రుషికొండ దగ్గర పరిశీలన కోసం వచ్చిన వాళ్ళపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామన్నారు.

## పోలవరం ఎత్తు తగ్గించే కుట్రలు

**కేంద్రం నిధులు డైవర్ చేశారన్న అంబటి**

**మాజీమంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న నిమ్మల**

**ఆధారాలు ఉంటే చూపాలని డిమాండ్**



అమరావతి,నవంబర్ 2 : కూటమి ప్రభుత్వం కుట్రతో ఏపీకి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు బలి కాబోతుందని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరానికి విఘాతం కలుగుతుందని, ఆ ప్రాజెక్టుకు ఉరి ఖాయమని అన్నారు. గతంలో చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్‌ను సరైన విధానంగా నిర్మించక పోలవరం పనులు పూర్తికాలేదని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరాన్ని గాడిలో పెట్టామని పేర్కొన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రావడంతో పోలవరాన్ని పాతర వేయనున్నాడని ఆరోపించారు. పక్క రాష్ట్రాలఒత్తిడితో పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీ ముఖ్యమని కేంద్రంతో ఒప్పందం చేసుకున్న చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును గంగలో కలుపనున్నారని విమర్శించారు. పోలవరానికి రూ. 12,157 కోట్లు కేంద్ర నిధుల విడుదలకు గత వైసీపీ ప్రభుత్వమే కారణమని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం విడుదల చేసిన అడ్వాన్స్ నిధులను డైవర్ట్ చేశారని ఆరోపించారు. వైసీపీ నేత మాజీ మంత్రి అంబటి రాంబాబుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ట్విట్టర్‌లో కౌంటర్ ఇచ్చారు. అబద్ధాలు ఆడడంలో అంబటిది అందె వేసిన చెయ్యి అంటూ విమర్శలు గుప్పించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించినట్లు ఆధారాలు ఉంటే చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. నిద్రపోయే వాణ్ణి లేపవచ్చు.. నిద్ర నటించే వాణ్ణి ఎవరు లేపగలరు? అంటూ సెటైర్లు వేశారు. అలాగే అంబటికి అన్నీ తెలుసని, అయినా వాళ్ల పార్టీ అధినేత మెప్పుకోసం ఆయన చెప్పిన అబద్ధాలనే ఈయన పదేపదే చెబుతున్నారన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తున్నట్లు అసలు మీకు ఎవరు చెప్పారు? ఎప్పుడు చెప్పారు? మీ దగ్గర ఆధారాలు ఉంటే చూపించండని అంబటిని మంత్రి నిమ్మల నిలదీశారు. మాకు తెలియకుండా మీ వైయస్సార్ పార్టీకి, నేతలకు మాత్రమే పంపారా! పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లకు పెంచి పూర్తి చేస్తామని నేను చెబితే సరిపోదా.. ప్రధాని మోదీ, కేంద్ర జల శక్తి మంత్రితో చెప్పించాలని అనడానికి మీకు అసలు సిగ్గుందా! అంటూ నిమ్మల ఫ్గ÷ర్ అయ్యారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ రెండు కూడా ఎన్డీఏ ప్రభుత్వాలేనని.. తమది డబల్ ఇంజిన్ సర్కార్ అని.. ఆ విషయం గుర్తేరిగి మాట్లాడండి అని మంత్రి నిమ్మల వైసీపీ నేత అంబటికి వార్నింగ్ ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలది ఒకటే మాట, ఒకటే బాట అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పోలవరం, అమరావతి రెండూ, రెండు కళ్ళు అని ప్రగతి, సంక్షేమం ఆయనకు సమప్రాధాన్యం అని చెప్పుకొచ్చారు. అందువల్ల పోలవరాన్ని సాంకేతిక సలహా మేరకు ముందుకు తీసుకువెళతామన్నారు. పోలవరం ప్రాజెక్టుపై మాకు 100కు 150 శాతం చిత్తశుద్ధి ఉందన్నారు. పోలవరం అవశ్యకత మీకంటే మాకు బాగా తెలుసని.. ప్రాజెక్టు ఎత్తుని 41.15 మీటర్లకు కుదించేలా చంద్రబాబు

కేంద్రంతో రహస్య ఒప్పందం చేసుకుని ఆ విషయం గోప్యంగా ఉంచినట్టు అంబటి ఆరోపించడం చూస్తే ఆయన మానసిక పరిస్థితి మీద డౌట్ వస్తుందని చురకలు వేశారు. అక్టోబర్ 9న ఇచ్చిన రూ. 2348 కోట్లు మళ్ళించామనడం ఇదొక తప్పుడు ఆరోపణన్నారు. నిరూపించే దమ్ముందా మీకు? అంటూ ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత సాంకేతిక ప్రమాణాల మేరకు నిర్మించి తీరుతామన్నారు. ఆంధ్రుల అభిమానాన్ని శాశ్వతంగా చూరగొంటామని.. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామని కామెంట్స్ చేశారు. మీరు అబద్దాలు మానేయండి. డైవర్షన్ పాలిటిక్స్ మానుకోండి. మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మసక బారిన మీ పార్టీ బతికి బట్ట కట్టడం కష్టం అంటూ ఎద్దేవా చేశారు.

## పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి

**రాయలసీమ జిల్లాలు విద్యుత్తు ప్రాజెక్టులకు అనుకూలం**

**అనుయాయుల కోసం అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు**

**జగన్ సర్కార్ నిర్వాకంపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి**

ఏలూరు,నవంబర్ 2 : అనుయాయులకు మేలు చేయడం కోసం జగన్ ఎక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు చేశారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. జగన్ చేసిన తప్పుల కారణంగా నేడు ప్రజలపై భారం పడుతుందన్నారు. ప్రతి ఏడాది విద్యుత్తు వినియోగం పెరుగుతోందని, దానికి అనుగుణంగా ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ జిల్లాలు విద్యుత్తు ప్రాజెక్టులకు అనుకూలమని మంత్రి తెలిపారు. బయట నుంచి విద్యుత్తు కొనుగోలు చేయకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు మాత్రమే అయిందని, తక్కువ వ్యవధిలో అద్భుతాలు చేయలేమన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వైసీపీ నాశనం చేసిందని, జగన్ పాలనలో అభివృద్ధి కుంటిపడిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా స్మార్ట్ మీటర్లు పెట్టలేదని, కేవలం వైసీపీ తమ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ అసత్య ప్రచారాలను మానుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే పట్టభద్రుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ జిల్లాలో పార్టీ నేతలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు నీటి సంఘాల ఎన్నికలు, సహకార సంఘాల ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల సన్నద్ధతపై సమావేశంలో చర్చించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు దిశగా ముందుకెళ్తోందన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్లాలనేదానిపై చర్చించామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వ నాశనమైందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు సమస్యలు ఉన్నాయని, అలాగే జిల్లాలో రోడ్ల సమస్య ఉందని ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. రానున్న రోజుల్లో రాజకీయంగా, అభివృద్ధి పరంగా ముందుకు వెళ్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రహదారుల మరమ్మతులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారయ్యాయన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రహదారుల నిర్మాణంతో పాటు రోడ్ల మరమ్మతులు చేయిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను విధించిందని, తాము అధికారంలోకి రాగానే చెత్త పన్నును

తొలగించామన్నారు. ట్రూ అప్ ఛార్జీల భారం ప్రజలపై మోపింది తాము కాదన్నారు. జగన్ ఆ భారం ప్రజలపై వేసి నెమ్మదిగా తప్పుకున్నారని మంత్రి విమర్శించారు.

## త్వరలో ఏపీకి భారీగా పెట్టుబడులు

**మంత్రి నారా లోకేశ్ టూర్ సక్సెస్**

**వారం రోజులపాటు అమెరికాలో పర్యటించిన లోకేశ్**




అమరావతి, నవంబర్ 2 : రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది. గత వారం రోజులుగా అమెరికాలో మంత్రి పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా లోకేష్ అమెరికా పర్యటన కొనసాగింది. వారం రోజుల పర్యటనలో 100కు పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడంలో మంత్రి సక్సెస్ అయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను ఆవిష్కరించారు. ఐదేళ్ల విధ్వంసక పాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడమే లక్ష్యంగా లోకేష్ టూర్ సాగింది. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై పలు దిగ్గజ కంపెనీలు సానుకూల సంకేతాలు ఇచ్చాయి. లోకేష్ భేటీల నేపథ్యంలో జనవరిలో దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సులో పెద్ద ఎత్తున ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. లోకేష్ పర్యటన విజయవంతంపై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అమెరికాలో లోకేష్ బిజీబిజీగా గడిపారు. దిగ్గజ కంపెనీలతో భేటీ అవుతూ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇది మంచి అవకాశం అంటూ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ఈ క్రమంలో ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలు వస్తే రాష్ట్రంలో చాలా మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. జగన్ హయాంలో ఎక్కడా కూడా పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ అభివృద్ధే లక్ష్యంగా దూసుకెళ్తోంది. అయితే జగన్ అమెరికా వెళ్లినా, ఢిల్లీకి వెళ్లినా స్వప్రయోజనాల కోసమే తప్ప రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచించిన పరిస్థితి లేదు. గత ఐదేళ్లలో పెట్టుబడుల ఊసే లేని నవ్యాంధ్రకు పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగింది. ప్రముఖ దిగ్గజ కంపెనీల అధిపతులతో విస్తృతంగా చర్చించారు. ఏపీలో ఏఏ రంగాలలో పెట్టుబడులకు అవకాశం ఉందో వివరించారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ పునరుద్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్ కార్లు, రియల్‌ఎస్టేట్ రంగంలోని ప్రముఖులతో సంప్రదింపులు జరిపి అమరావతి మొదలుకుని ఉత్తరాంధ్ర, గోదావరి, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే విధంగా ఆయా రంగాల్లో అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆయన పర్యటనలో సీఎంవో సంయుక్త కార్యదర్శి కార్తికేయ మిశ్రా కూడా పాల్గొన్నారు. గత నెల 25వ తేదీన హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లిన లోకేష్ మర్నాటి నుంచి వరుసగా వారం రోజుల పాటు అనేక సంస్థల సీఈవోలు, అధినేతలతో సమావేశమయ్యారు. శుక్రవారం అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణతో తన పర్యటనను ముగించుకున్న లోకేష్ భారత కాలమానం ప్రకారం ఈరోజు (శనివారం) ఉదయం స్వదేశానికి బయలుదేరుతారు. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకుంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

## నిరాధార ఆరోపణలు ఖండిస్తున్నాం

**కెనాడా మంత్రి వ్యాఖ్యలపై భారత్ అసంతృప్తి**

**విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్**

న్యూఢిల్లీ, నవంబర్ 2 : కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాపై కెనడా మంత్రి చేసిన వ్యాఖ్యలపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలపై కెనడా హైకమిషన్ ప్రతినిధిని పిలిపించామని విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. కమిటీ ముందు హెూంశాఖ మంత్రి షా గురించి కెనడా మంత్రి డేవిడ్ మారిసన్ చేసిన నిరాధారమైన ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా నిరసిస్తోందన్నారు. భారత్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు, ఇతర దేశాలను ప్రభావితం చేసే వ్యూహంలో భాగంగా కెనడా ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగానే అంతర్జాతీయ మీడియాకు లీక్ ఇస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారహిత చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర పరిణామాలను కలిగిస్తాయని హెచ్చరించారు. ఇటీవల కెనడా ఖలిస్తానీ ఉగ్రవాది హత్యకుట్రలో భారత కేంద్ర మంత్రి అమిత్ షా పేరును ప్రస్తావించింది. ఆ దేశ విదేశాంగ వ్యవహారాల డిప్యూటీ మినిస్టర్ డేవిడ్ మారిసన్ లీకుల ఆధారంగా ది వాషింగ్టన్ పోస్ట్ పత్రిక కథనం ప్రచురించింది. లీకులను తాను చేసినట్లుగా మారిసన్ అంగీకరించారు. ఈ కుట్ర వెనుక అమిత్ షా హస్తమున్నదని తానే వాషింగ్టన్ పోస్టుకు చెప్పానని కెనడా పార్లమెంటరీ ప్యానెల్ ఎదుట డేవిడ్ మారిసన్ అంగీకరించారు. ఆ పత్రిక జర్నలిస్టు తనకు కాల్ చేసి ఆ కుట్ర వెనుక ఉన్నది ఆయనే (అమిత్ షా) నా అని అడిగారని.. ఔనని చెప్పినట్లు వివరించారు. భారత అధికారులు, అమిత్ షా ప్రమేయం ఉన్నదని కెనడా అధికారులు చెప్పారంటూ ఇటీవల వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ఇటీవల ఓ కథనం ప్రచురించింది. అయితే, కెనడా అధికారులు మాత్రం ఇందుకు ఆధారాలు చూపడంలో విఫలమయ్యారు. ఈ వ్యవహారంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 3 నవంబర్ 2024





# పట్టు బిగించిన టీమిండియా

**భారత్ తొలి ఇన్నింగ్స్ 263**

**ఆదుకున్న గిల్, పంత్**

**కివీస్ రెండో ఇన్నింగ్స్ 171/9**

**జడేజాకు నాలుగు, అశ్విన్‌కు మూడు వికెట్లు**



రెండు రోజుల్లోనే ఎన్ని మలుపులో.. శుక్రవారం ఆట ముగిసేసరికి భారత్‌కు మరో ఓటమి తప్పదా? అనిపించింది. కానీ మర్నాడే అన్ని విభాగాల్లో రాణించి ఏకంగా గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తోంది. పిచ్ ఎలాంటిదైనా డోంట్ కేర్ అనే తరహాలో రెచ్చిపోయిన రిషభ్ పంత్ జట్టు స్కోరును రాకెట్ వేగంతో పెంచగా.. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ క్లాసిక్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వీరి దెబ్బకు టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడం విశేషం. ఆ తర్వాత స్పిన్నర్ జడేజా మరోసారి ప్రతాపం చూపగా, అశ్విన్ సహకరించడంతో కివీస్ విలవిల్లాడింది. కేవలం 143 రన్స్ ఆధిక్యంలో ఉన్న ప్రత్యర్థి చేతిలో మరో వికెట్ మాత్రమే ఉంది. దీంతో మూడో టెస్టు కూడా మూడు రోజుల్లోనే ముగియడం ఖాయమనిపిస్తోంది.

ముంబై: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీసలో మొదటిసారి భారత జట్టు ఆధిపత్యం కనబరచింది. తొలి రోజు చివర్లో బ్యాటర్లు తడబాటుకు గురైనా.. శనివారం మాత్రం సూపర్ బ్యాటింగ్, బౌలింగ్‌తో టెస్టును మనవైపు తిప్పేశారు. ముందుగా భారత్‌కు 28 పరుగుల స్వల్ప ఆధిక్యమైనా దక్కిందంటే శుభ్‌మన్ గిల్ (90), రిషభ్ పంత్ (59 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 60)ల ఆటతీరే కారణం. వీరి కీలక ఆటతీరుతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. చివర్లో వాషింగ్టన్ సుందర్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) ఆకట్టుకున్నాడు. స్పిన్నర్ ఎజాజ్‌కు 5 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో కివీసను స్పిన్నర్లు జడేజా (4/52), అశ్విన్ (3/63) దెబ్బతీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసేసరికి పర్యాటక జట్టు 43.3 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులే చేయగలిగింది. విల్ యంగ్ (51) అర్ధసెంచరీ చేశాడు. క్రీజులో ఎజాజ్ (7) ఉన్నాడు. ప్రస్తుతం కివీస్ 143 పరుగుల ఆధిక్యంలో ఉంది. బంతి చక్కగా టర్న్ అవుతున్నందున కివీస్‌ను తొలి సెషన్‌లో వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలి. లక్ష్యం 200లోపే ఉండడం భారత్‌కు శ్రేయస్కరం. ఓవరాల్‌గా శనివారం 15 వికెట్లు నేలకూలాయి.

**అటు దూకుడు.. ఇటు నిలకడ:**

ఓవర్‌నైట్ స్కోరు 86/4తో పీకల్లోతు కష్టాల్లో పడిన భారత జట్టు.. భారమంతా గిల్, పంత్‌పై వేస్తూ రెండో రోజును ఆరంభించింది. మరో రెండు వికెట్లు కోల్పోతే మ్యాచ్ పూర్తిగా ప్రత్యర్థి చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉండేది. అయితే సీనియర్లకు బ్యాటింగ్ కష్టమైన టర్నింగ్ పిచ్‌పై గిల్, పంత్ జోడీ చెలరేగింది. ముఖ్యంగా పంత్ చావోరేవో అన్నట్టుగా బ్యాట్ ఝుళిపించాడు. భారీషాట్లతో కివీస్ బౌలర్లను డిఫెన్స్‌లో పడేశాడు. రోహిత్, విరాట్ సైతం దూకుడుగా ఆడేందుకు ఇబ్బందిపడినా పంత్ మాత్రం సహజశైలిలో ఎదురుదాడికి దిగాడు. తొలి రెండు బంతులను బౌండరీలకు తరలించి తన ఉద్దేశాన్ని చాటాడు. బంతి టర్న్ కావడంతో పాటు ఒక్కోసారి అనూహ్యంగా బౌన్స్ అవుతున్నా తగ్గేదేలే.. అనే రీతిలో 8 ఫోర్లతో పాటు రెండు సిక్సర్లు బాదాడు. దీంతో పంత్ 36 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో గిల్ సాధికారిక ఆటతీరు కూడా పంత్ వేగంగా ఆడేందుకు తోడ్పడింది. ఐదు వికెట్లతో దెబ్బతీసిన ఎజాజ్‌ను సైతం అతను వదల్లేదు. లంచ్‌కు కాస్త ముందు ఐదో వికెట్‌కు గిల్‌తో కలిసి 96 పరుగులు జోడించాక స్పిన్నర్ సోధి ఓవర్‌లో పంత్ వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో భారత్ వేగంగా వికెట్లను కోల్పోయింది. వరుస ఓవర్లలో జడేజా (14), సర్ఫరాజ్ (0) పెవిలియన్‌కు చేరగా.. సెంచరీకి చేరువలో గిల్ ఎనిమిదో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ స్థితిలో సుందర్ కివీస్ స్కోరును సమం చేయడంతో పాటు సోధి ఓవర్‌లో 4,6తో జట్టుకు ఆధిక్యాన్ని కూడా అందించాడు. అయితే 60వ ఓవర్‌లో ఆకాశ్‌దీప్ (0) రనౌట్ కావడంతో భారత్ 83 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది.

**దెబ్బతీసిన స్పిన్ జోడీ:**

భారత స్పిన్నర్లు జడేజా, అశ్విన్ కలిసికట్టుగా కివీసను కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో చెలరేగిన జడేజా కివీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ మెరవగా, అశ్విన్ ఈసారి మూడు వికెట్లతో ఖాతా తెరిచాడు. మొత్తంగా ఈ ఇద్దరూ కలిసి ఏడు వికెట్లు తీశారు. మరోవైపు తొలి ఓవర్‌లోనే పేసర్ ఆకాశ్ అద్భుత ఇన్‌స్వింగర్‌తో ఓపెనర్ లాథమ్ (1)ను బౌల్డ్ చేశాడు. కాన్వే (22) కుదురుకున్నట్టు కనిపించినా సుందర్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే రచిన్ రవీంద్ర (4)ను అశ్విన్ అవుట్ చేసి ఈ టెస్టులో తొలి వికెట్ సాధించాడు. ఈ దశలో కివీసను యంగ్, మిచెల్ (21) కాసేపు ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించాక మిచెల్‌ను అవుట్ చేసిన జడేజా తిరిగి తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. బ్లండెల్ (4), సోధి (8), హెన్రీ (10)లను అవుట్ చేసి కివీసను వణికించాడు. అటు కీలక ఇన్నింగ్స్ ఆడిన యంగ్ ఎనిమిదో వికెట్‌గా అశ్విన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఉన్న కాసేపు ఫిలిప్స్ (14 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 26) వేగంగా ఆడాడు.

**స్కోరుబోర్డు**

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) ఎజాజ్ 30బీ రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18బీ గిల్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 90బీ సిరాజ్ (ఎల్బీ) ఎజాజ్ 0బీ విరాట్ (రనౌట్) 4బీ పంత్ (ఎల్బీ) సోధీ 60బీ జడేజా (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 14బీ సర్ఫరాజ్ (సి) బ్లండెల్ (బి) ఎజాజ్ 0బీ సుందర్ (నాటౌట్) 38బీ అశ్విన్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 6బీ ఆకాశ్ దీప్ (రనౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 3బీ మొత్తం: 59.4 ఓవర్లలో 263 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-25, 2-78, 3-78, 4-84, 5-180, 6-203, 7-204, 8-227, 9-247, 10-263. బౌలింగ్: హెన్రీ 8-1-26-1బీ ఓరోర్క్ 2-1-5-0బీ ఎజాజ్ 21.4-3-103-5బీ ఫిలిప్స్ 20-0-84-1బీ రచిన్ 1-0-8-0బీ సోధీ 7-0-36-1.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బి) ఆకాశ్ 1బీ కాన్వే (సి) గిల్ (బి) సుందర్ 22బీ యంగ్ (సి అండ్ బి) అశ్విన్ 51బీ రచిన్ (స్టంప్) పంత్ (బి) అశ్విన్ 4బీ మిచెల్ (సి) అశ్విన్ (బి) జడేజా 21బీ బ్లండెల్ (బి) జడేజా 4బీ ఫిలిప్స్ (బి) అశ్విన్ 26బీ సోధి (సి) కోహ్లీ (బి) జడేజా 8బీ హెన్రీ (బి) జడేజా 10బీ ఎజాజ్ (బ్యాటింగ్) 7బీ ఎక్స్‌ట్రాలు: 17బీ మొత్తం: 43.3 ఓవర్లలో 171/9బీ వికెట్ల పతనం: 1-2, 2-39, 3-44, 4-94, 5-100, 6-131, 7-148, 8-150, 9-171బీ బౌలింగ్: ఆకాశ్ 5-0-10-1బీ సుందర్ 10-0-30-1బీ అశ్విన్ 16-0-63-3బీ జడేజా 12.3-2-52-4.

# తన లైఫ్‌లో ఇలాంటిది చూస్తానని అనుకోలేదు

**ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా**




టీమిండియాను ఓడించడం అంత ఈజీ కాదు. ప్రస్తుతం మూడు ఫార్మాట్లలోనూ మన జట్టు హవా నడుస్తోంది. మనతో మ్యాచ్ అంటే బడా టీమ్స్ కూడా భయపడుతున్నాయి. మెన్ ఇన్ బ్లూ ఆడిన ప్రతి చోట అదరగొడుతోంది. భారత్‌ను ఓడించడం చాలా కష్టంగా మారుతోంది. ఇంక సొంతగడ్డ మీద మన జట్టుకు తిరుగులేదనే చెప్పాలి. ఇక్కడ మ్యాచ్‌లు ఉంటే భారత ప్లేయర్లు పులుల్లా చెలరేగి ఆడతారు. అందునా టెస్టుల్లో అయితే ఎదురొచ్చిన ప్రతి జట్టును చిత్తుగా ఓడించి పంపుతారు. కానీ న్యూజిలాండ్‌తో సిరీస్‌లో అంతా తారుమారైంది. మూడు టెస్టుల సిరీస్‌ను ఇప్పటికే 0-2తో కోల్పోయిన రోహిత్ సేన.. ఆఖరి టెస్టులోనూ వెనుకంజలో ఉంది. దీనిపై సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రియాక్ట్ అయ్యాడు. సొంతగడ్డ మీద భారత్ సిరీస్ ఓడుతుందని ఎప్పుడూ అనుకోలేదన్నాడు జడేజా. ఇది తాను ఊహించలేదని, అంతా తారుమారైందన్నాడు. తన లైఫ్‌లో ఇలాంటిది చూస్తానని అనుకోలేదన్నాడు. తాను టీమిండియాకు ఆడినన్ని రోజులు సొంతగడ్డపై టెస్టుల్లో సిరీస్ ఓటమి రాదని అనుకున్నానని.. కానీ ఇప్పుడు పరాభవం ఎదురైందన్నాడు. హోం సిరీస్‌ల్లో అజేయంగా ఉన్నామని.. వరుసగా 18 సిరీస్‌లు గెలిచామన్నాడు. కానీ ఎట్టకేలకు ఓటమి రుచి చూడక తప్పలేదన్నాడు జడ్డూ. భారీ అంచనాల నడుమ బరిలోకి దిగి సిరీస్ ఓడటం తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందన్నాడీ స్పిన్ ఆల్‌రౌండర్.తొలి రెండు టెస్టుల్లో ఓటమితో బాధలో ఉన్న జడేజా ఆఖరి మ్యాచ్‌లో భారత్ విజయం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ మ్యాచ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌లో 22 ఓవర్లలో 65 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడతను. అతడితో పాటు యంగ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ (4/81) రాణించడంతో కివీస్‌ను 235 పరుగులకు కట్టడి చేసింది రోహిత్ సేన. అయితే ఆ తర్వాత మన బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి రోజు ఆట ముగిసేసరికి టీమిండియా స్కోరు 4 వికెట్ల నష్టానికి 86. వైట్‌వాష్ గండం నుంచి తప్పించుకోవాలంటే రాబోయే కొన్ని సెషన్ల పాటు భారత ఆటగాళ్లు తమ బెస్ట్ గేమ్‌ను బయటకు తీయాల్సి ఉంటుంది.

# రిషబ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఎందుకు విడిచాడు?



ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ రిషబ్ పంత్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. ఈ క్రమంలో ఓ ఇంట్రస్టింగ్ న్యూస్ బయటికొచ్చింది. ఫ్రాంచైజీ పంత్‌ను విడుదల చేయడంతో 2020 ఫైనలిస్ట్‌లతో పంత్ తొమ్మిదేళ్ల అనుబంధం ముగిసింది. కాగా.. ఢిల్లీ జట్టు రిటెన్షన్ లిస్ట్‌లో అక్షర్ పటేల్ మొదటి ఎంపికగా ఉన్నారు. అయితే.. సహ-యజమాని జీహెంఆర్ గ్రూప్ తీసుకున్న నిర్ణయాలపై పంత్ అసంతృప్తిగా ఉన్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. జీహెంఆర్ గ్రూప్ తదుపరి రెండేళ్లపాటు ఫ్రాంచైజీని నిర్వహిస్తుంది. జీహెంఆర్ గ్రూప్ ఇటీవల కోచింగ్ సిబ్బందిలో కూడా మార్పులు చేసింది. హేమాంగ్ బదానీని హెడ్ కోచ్‌గా, వేణుగోపాల్ రావును జట్టు డైరెక్టర్‌గా నియమించాలనే నిర్ణయంపై పంత్ అసంతృప్తిగా ఉన్నారు. అంతే కాకుండా.. జీఎంఆర్ గ్రూప్ తన స్వేచ్ఛను అడ్డుకోవడంపై కూడా పంత్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో.. పంత్ నుంచి కెప్టెన్సీని తప్పించి అక్షర్ పటేల్‌కు అప్పగించాలని ఢిల్లీ క్యాపిటల్స్ ఆలోచిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. 2016 మెగా వేలంలో పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరాడు. గత రెండు మెగా వేలంలో అతడిని రిలీజ్ చేయలేదు. గత మెగా వేలంలో పంత్ ఫ్రాంచైజీతో వేలం టేబుల్ వద్ద కూర్చుని నిర్ణయాలు తీసుకోవడం కనిపించింది. కాగా.. JSW గ్రూప్, GMR గ్రూప్ మధ్య ఢిల్లీ క్యాపిటల్స్ 50-50 శాతం వాటాను కలిగి ఉంది. ప్రతి గ్రూప్ రెండు సంవత్సరాల పాటు ఫ్రాంచైజీని నడుపుతుంది. 2025, 2026 ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ GMR గ్రూప్ కింద ఉంటుంది.. ఆ గ్రూప్ దర్శకత్వంలో ఆడుతుంది.జీఎంఆర్ గ్రూప్ నిర్ణయం కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రికీ పాంటింగ్‌ను హెడ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పించింది. పాంటింగ్ ఏడేళ్లపాటు జట్టుకు ప్రధాన కోచ్‌గా పని చేశారు. అంతేకాకుండా.. టీమిండియా డైరెక్టర్‌గా ఉన్న వెటరన్ క్రికెటర్ సౌరవ్ గంగూలీని కూడా తొలగించారు. ఈ మార్పులు పంత్‌ను అసంతృప్తికి గురి చేశాయి.. దీంతో వేలంలో వేరే ఫ్రాంచైజీకి ఆడాలని నిర్ణయించుకున్నాడు. కాగా.. రిషబ్ పంత్ ఈ ఏడాది టీమిండియాకు టీ20 ప్రపంచ కప్‌ను గెలిపించిన ఆటగాళ్లలో ఉన్నాడు.


# యూఏఈ చేతిలో ఓడిన టీమిండియా

హాంకాంగ్ సిక్స్ టోర్నమెంట్‌లో భారత్, యూఏఈ మధ్య ఉత్తేజకరమైన మ్యాచ్ జరిగింది. అయితే, మ్యాచ్ లో టీమిండియా 1 పరుగు తేడాతో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ మ్యాచ్‌లో, యూఏఈ 6 ఓవర్లలో 130 పరుగులు చేసింది. దీనికి ప్రతిస్పందనగా టీమిండియా 6 ఓవర్లలో 129 పరుగులు మాత్రమే చేయగలిగింది. దాంతో ఒక పరుగుతో మ్యాచ్‌ను కోల్పోయింది. యూఏఈపై టీమిండియా కెప్టెన్ రాబిన్ ఉతప్ప 10 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 430 స్ట్రైక్ రేట్‌తో 43 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతనితో పాటు స్టువర్ట్ బిన్నీ కూడా 11 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 400 స్ట్రైక్ రేట్‌తో 44 పరుగులు చేశాడు. టీమిండియా విజయానికి చివరి ఓవర్‌లో 32 పరుగులు కావాలి. ఈ సమయంలో బిన్నీ 4 సిక్సర్లు, 1 ఫోర్ కొట్టాడు. అయితే, అదృష్టం చివరి బంతికి టీమిండియా వైపు అనుకూలంగా లేదు. చివరి బంతికి బిన్నీ రనౌట్ కావడంతో టీమిండియా 1 పరుగుతో మ్యాచ్‌లో ఓడిపోయింది. ఇక యూఏఈ తరఫున ఖలీద్ ఖాన్, జహూర్ ఖాన్ లు బ్యాట్ తో రెచ్చిపోయారు. ఓపెనర్ ఖలీద్ 10 బంతుల్లో ఒక ఫోర్, 6 సిక్సర్ల సాయంతో 42 పరుగులు చేయగా.. జహూర్ ఖాన్ 11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 37 పరుగులు చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌ల ఆధారంగా టీమిండియా జరిగిన మ్యాచ్‌లో యూఏఈ 6 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసి ఒక పరుగు తేడాతో విజయం సాధించింది. స్టువర్ట్ బిన్నీ 2 ఓవర్లలో 31 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News

## పోస్టర్ ఎడిట్‌పై మృణాల్ ఠాకూర్ మండిపాటు

'ది ఫ్యామిలీ స్టార్' సినిమా పోస్టర్‌ను ఎడిట్ చేసిన ఓ నెటిజన్‌పై హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మండిపడ్డారు. అతను చేసిన పని ఏమాత్రం నచ్చలేదన్నారు. ఇంతకీ నెటిజన్ ఏం చేశాడంటే.. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సాఖిన్ అనే వ్యక్తి ఇన్‌స్టా వేదికగా ఓ ఫొటో షేర్ చేశాడు. గత ఏడాది దీపావళికి సంబంధించిన 'ది ఫ్యామిలీ స్టార్' పోస్టర్‌ను అతడు ఎడిట్ చేశాడు. విజయ్ దేవరకొండ స్థానంలో తన ఫొటోని పెట్టి.. మృణాల్‌తో కలిసి టపాసులు కాలుస్తున్నట్లు క్రియేట్ చేశాడు. "దీపావళి ఫొటో ఎడిటింగ్.. బాలీవుడ్ నటి ఫొటోషూట్" అని పేర్కొన్నాడు. ఇది కాస్త మృణాల్ కంట పడింది. దీనిని చూసి ఆమె అసహనానికి గురయ్యారు. వెంటనే ఆ పోస్ట్‌కు రిప్లై ఇచ్చారు. "బ్రదర్.. మీకు మీరే ఎందుకు తప్పుడు భరోసా ఇచ్చుకుంటున్నారు? మీరు చేసిన పని బాగుందనుకుంటున్నారా? ఇది ఏమాత్రం బాలేదు" అని తెలిపారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ అతడు చేసిన పనిని తప్పుబడుతున్నారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం ' ది ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ దర్శకత్వం వహించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ ఏడాది ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదలైంది. అయితే ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ బాలీవుడ్‌లో వరుస చిత్రాలు చేస్తున్నారు. 'పూజా మేరీ జాన్', 'హై జవానీ తో ఇష్క్ హెూనా హై', 'సన్ ఆఫ్ సర్దార్ 2', 'తుమ్ హీ హెూ' వంటి చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు.





## ఆ సినిమా కోసం బీడీలు కాల్చాను: నభా నటేష్

సినిమాల పాత్రల పర్‌ఫెక్షన్ కోసం హీరోలే కాదు హీరోయిన్లు కూడా ఎక్కడా తగ్గేదేలే.. అంటోంది అందాల తార నభా నటేష్. ఇటీవల ప్రియదర్శితో కలిసి 'డార్లింగ్' సినిమాతో పలకరించిన ఆమె ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా వున్నారు. అందంతో పాటు అభినయం కూడా తెలిసిన కథానాయికలు అరుదుగా వుంటారు. అలాంటి కోవలోకి వస్తుంది నభా నటేష్. అయితే ఆమె ఇటీవల తన మొదటి సినిమా అవకాశం గురించి, ఆ పాత్ర కోసం ఆమె చేసిన హెూమ్ వర్క్ గురించి మీడియాతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ " బెంగళూరులో మోడలింగ్‌తో పాటు ఓ నాటక బృందంలో చేరి నాటకాలు కూడా ప్రదర్శించడం అలవాటు చేసుకున్నాను. అప్పటికే కొన్ని వీధి నాటకాలు కూడా ప్రదర్శించాను. ఆ అనుభవంతోనే సినిమాలో ప్రయత్నించాలనే ఆలోచన వచ్చి మొదలుపెట్టాను. అప్పుడే కన్నడలో శివ రాజ్‌కుమార్ పక్కన వజ్రకాయలో అవకాశం వచ్చింది. ఆ షూటింగ్‌కు మూడు నెలల పాటు ట్రైనింగ్ తీసుకున్నాను. ఓ పల్లెటూరి అమ్మాయిలా అందులో కనిపించాను. ఈ సినిమా కోసం వచ్చిన చాలా అవకాశాల్ని కూడా వదులుకున్నాను. ఈ సినిమా కోసమే హార్స్ రైడింగ్ నేర్చుకున్నాను. అంతేకాదు నాకు అసలు పొగ అంటే పడదు. కానీ పాత్ర కోసం బీడీలు కాల్చాను. ఆ వాసన భరించలేక రెండ్రోజులు ఏమీ తినలేకపోయాను. అయితే నా కష్టానికి తగిన ప్రతిఫలం, గుర్తింపు నాకు ఆ సినిమాతో లభించింది' అంటూ చెప్పుకొచ్చారు.



## డ్రెస్ చూసి అవాక్కయ్యా!

1999లో వచ్చిన 'దిల్బర్ దిల్బర్' పాటకున్న క్రేజే వేరు. మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ ఆడిపాడిన ఈ పాటకు ఫిదా అవ్వని నాటితరం కుర్రకారు లేరు. అయితే.. 2018లో 'సత్యమేవ జయతే' సినిమా కోసం ఈ పాటను రీమిక్స్ చేశారు. ఇందులో బాలీవుడ్ ఐటమ్ గర్ల్ నోరా ఫతేహి వేసిన స్టెప్పులకు నేటితరం కుర్రాళ్లు నోరెళ్లబెట్టారు. అయితే.. ఈ పాట కోసం తాను ధరించాల్సిన డ్రెస్ మరీ పొట్టిగా ఉండటంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందట నోరా. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో నాటి సంగతులను చెప్పుకొచ్చింది. 'దిల్బర్ దిల్బర్' పాట రీమిక్స్ అనగానే నోరా ఎగిరి గంతేసిందట. దీన్ని మామూలు ఐటం సాంగ్స్‌లా కాకుండా.. ప్రత్యేకంగా చేయాలనుకున్నదట. ఆమాటే ఆ చిత్ర నిర్వాహకులతోనూ చెప్పిందట. కానీ, అప్పుడు వాళ్లు ఇచ్చిన కాస్ట్యూమ్స్ చూసి ఒక్కసారిగా అవాక్కయ్యిందట. "వాళ్లిచ్చిన జాకెట్ చాలా చిన్నగా ఉంది. నాకు ఏమాత్రం నచ్చలేదు. నన్ను మరీ అంత సెక్సువలైజ్ చేసి చూపించకండని వారికి చెప్పాను. చేసేది సెక్సీ సాంగే అయినా.. మరీ అసభ్యకరంగా ఉండొద్దని కోరాను. ఇంత చిన్న బట్టలు వేసుకోలేను.. ఇంకేమైనా ఇవ్వండని అడిగాను. తర్వాతి రోజు మరో బ్లౌజ్ రెడీ చేశారు. అది కూడా చిన్నగానే అనిపించొచ్చు. కానీ, ముందు ఇచ్చినదాని కంటే అది ఎంతో మెరుగ్గానే ఉంది!" అని నోరా ఫతేహి చెప్పుకొచ్చింది. తనకు ఏమాత్రం ఇష్టం లేకున్నా.. తానేంటో నిరూపించుకోవాలనే ఆ సాంగ్‌లో నటించానని చెబుతున్నది నోరా. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. కెనడాకు చెందిన ఈ యాక్టర్ కమ్ డ్యాన్సర్.. తన అందం, నృత్యంతో అభిమానులను అలరిస్తున్నది. బాహుబలి-1లోనూ 'మనోహరా..' పాటలో మెరిసి.. తెలుగువారికి పరిచయమైంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా వస్తున్న 'మట్కా'లోనూ నటిస్తున్నది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986